# కరీంనగర్ వార్త

కరీంనగర్ - జగిత్యాల - పెద్దపల్లి - రాజన్నసిరిసిల్ల

ఆదివారం 2, జూన్ 2024 | 16 పేజీలు


## పకడ్బందీగా ఆన్‌లైన్‌లో కౌంటింగ్ వివరాల నమోదు చేయాలి

**జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్**



పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త: పకడ్బందీగా ఆన్‌లైన్ ఎన్‌కోర్ వెబ్‌సైట్‌లో కౌంటింగ్ వివరాలను నమోదు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ తెలిపారు.

2లో...







# పవనసుతునికి భక్తజన హారతులు

2లో..



- కొండగట్టు అంజన్న జయంతికి మూడు లక్షల మంది భక్తుల రాక
- అర్ధరాత్రి నుంచి దీక్ష విరమణకు పోటెత్తిన స్వాములు
- యాగశాల నుండి ఆలయంలోకి చేరిన ఉత్సవ మూర్తులు
- అంజన్నకు పట్టువస్త్ర అలంకరణ, పంచామృత అభిషేకాలు
- అంజన్న దర్శనానికి నాలుగు గంటలకు పైనే
- ఆదివారం సాయంత్రం వరకు రద్దీ కొనసాగే అవకాశం

మల్యాల, ప్రభాత వార్త: రామ లక్ష్మణ జానకి.. జై బోలో హనుమాన్ కి... నామస్మరణలతో శనివారం ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం మార్మోగింది. పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా కొండగట్టులో గత నెల 30 నుండి ఉత్సవాలు ఘనంగా జరుగుతుండగా శనివారం శ్రీ స్వామి వారి జయంతికి రాష్ట్ర నలుమూలల దీక్షలు స్వీకరించిన భక్తులతో పాటు ఇతర రాష్ట్రాలలో కూడా స్వామివారి దీక్షలు చేపట్టి కొండగట్టులో మాల విరమణకు దీక్ష పరులు కాలినడకన నెత్తిన ఇరుముడులతో కొండగట్టుకు వేలాదిగా చేరుకున్నారు.

## పేరుకే 24 గంటల వైద్యశాల

చందుర్తి, ప్రభాతవార్త: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు అంతంత మాత్రమే లభిస్తున్నాయి. సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చందుర్తి ప్రభుత్వ ఆసుపత్రి 65 సంవత్సరాల క్రితం ఆరు పడకల ఆసుపత్రిగా నిర్మించారు.

2లో..



- సేవలు మాత్రం అంతంత మాత్రమే
- స్థానికంగా ఉండరు సమయ పాలన పాటించరు
- చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పని తీరు

## కరీంనగర్‌లో 70 కిలోల గంజాయి పట్టివేత

**ముగ్గురిపై కేసు నమోదు**

కరీంనగర్, ప్రభాతవార్త : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో 70 కిలోల గంజాయి తరలిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. శనివారం కరీంనగర్ శివారు బైపాస్ రోడ్డు కేబుల్ బ్రిడ్జి సమీపంలో వన్ టౌన్ పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో ఏపీ 31బీహచ్ 2925 నెంబర్ గల స్విఫ్ట్‌కారులో 70 కిలోల గంజాయిని గుర్తించినట్లు కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్ తెలిపారు.



2లో..

# పవనసుతునికి భక్తజన హారతులు



మొదటి పేజీ తరువాయి..

దీక్ష విరమణ లు చేసుకోని ముడుపులు చెల్లించుకోని శ్రీ అంజన్న స్వామివారిని మనసారా దర్శించుకునేందుకు మనసారా దర్శించుకునేందుకు గాను శుక్రవారం రాత్రి నుండి కొండగట్టు అంజన్న క్షేత్రానికి వేలాదిగా భక్తులు తరలిరావడంతో కొండగట్టు ఆలయ పరిసరాలన్ని భక్తుల రద్ధీతో కాషాయవర్ణంగా మారింది. శుక్రవారం రాత్రి 10 నుండి శనివారం తెల్లవారుజాము మూడు గంటల వరకు దీక్షస్వాముల రాకతో ఆలయ పరిసరాలన్ని ఒకేసారి పొటెత్తడంతో మాల విరమణ, తలానీలాల కేంద్రంతో పాటు శ్రీ స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్లన్ని నిండిపోగా పరిసర ప్రాంతాల దీక్షాస్వాములతో కిక్కిరిసిపోయాయి. అంతేకాకుండా స్వామివారి జయంతి సందర్భంగా శనివారం కలిసి రావడంతో దీక్షాస్వాములతో పాటు సాధారణ భక్తుల సంఖ్య కూడా మరింత పెరగడంతో ఆలయంలో స్వామివారి దర్శనానికి నాలుగు గంటలు పట్టింది. ప్రత్యేక దర్శనాలు, సాధారణ దర్శనాలు కూడా విఐపిల రాకతో మరింత ఆలస్యం కావడంతో భక్తులు క్యూలైన్ లలో గంటల తరబడి నిలబడ్డారు. ఆలయంలో ప్రముఖులు వస్తున్నారని, పలుమార్లు ప్రధాన గోపురం గేట్లు తెరవడం, మూయడం, వారికి ప్రత్యేక దర్శనాలు కల్పించడం తో భక్తులు గందరగోళానికి గురికాగా అప్పటికే క్యూలైన్ లో గంటలకొద్ది వేచి చూస్తున్న భక్తులు అసహనానికి గురయ్యారు.

**యాగశాల నుండి ఆలయానికి చేరిన ఉత్సవమూర్తులు...** ఉత్స వాల మొదటి రోజు పాఠశాలలో ప్రత్యేకించి ఏర్పాటు చేసిన వేదికపై ఉత్స వమూర్తులను ప్రతిష్టించి హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించగా పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా వేద పండితులు, అర్చకులు ఆధ్వర్యంలో శ్రీ స్వామివారికి పట్టువస్త్రాల అలంకరణతో పాటు విశేష అభిషేకం, తులసి అర్చన, సహస్ర నాగవల్లి, అర్చన హోమం, మహా పూర్ణాహుతి, తిరుమంజలం, ఉయ్యాల సేవ, మంత్రపుష్పం, మహా నివేదన, ప్రత్యేక



పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను యాగశాల నుండి భక్తులతో ఊరేగింపుగా ఆలయంలోకి తరలించారు. అనంతరం ఆరాధన, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, అమ్మవారికి కుంకుమార్చన, ఒడిబియ్యం, సహస్రదీప అలంకరణ, గరుడ వాహన సేవ, కంకణద్వాసన, మంత్రపుష్పం, మహాద్వార్ ఆశీర్వాదం, సామూహిక భజన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

**ఆలయంలో కొనసాగుతున్న రద్ధీ....** జయంతి సందర్భంగా కొండగట్టులతో భక్తుల రద్ధీ కొనసాగుతూనే ఉంది. శనివారం జయంతి అయినప్పటికి ఆదివారం సాయంత్రం వరకు కూడా భక్తుల రద్ధీ కొనసాగే అవకాశం ఉందని భావిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుండి వేలాదిగా దీక్షస్వాములు కొండపైకి గుంపులు గుంపులుగా చేరుకోవడంతో పాటు సాధారణ భక్తులు కూడా తమ పిల్లల స్కూల్ లో సెలవులు ముగుస్తున్నందున అంజన్న క్షేత్రానికి వచ్చి దర్శించుకుంటున్నారు. దీంతో భక్తుల రద్ధీ ఆదివారం కూడా ఉంటుందని భావిస్తున్నారు.

**రద్ధీ దృష్ట్యా ఆర్జిత సేవలు 3 నుండి ప్రారంభం.....** జయంతి ఉత్స వాల సందర్భంగా కొండగట్టు ఆలయంలో వివిధ ఆర్జిత సేవలను నిలిపివేసి తిరిగి ఈనెల 2న కొనసాగిస్తామని అధికారులు పేర్కొన్నప్పటికి భక్తుల రద్ధీ దృష్ట్యా మరోక రోజు వాయిదా వేస్తున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఆర్జిత సేవలను ఈనెల 3 నుండి ఆమలులోకి తీసుకోస్తామని వారు తెలిపారు.





# పేరుకే 24గంటల వైద్యశాల

మొదటి పేజీ తరువాయి..

65 సంవత్సరాల క్రితం నిర్మించిన ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ కొంత మంది సిబ్బందిని ఉన్నతాధికారులు డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు పంపారు. మిగతా వారు కరీంనగర్, వేములవాడ, సిరిసిల్ల, కోరుట్ల నుంచి రాకపోకలు కొనసాగించడంతో ఎప్పుడు వస్తారు... ఎప్పుడు పోతారో... తెలియకుండా పోయింది. చందుర్తి ప్రభుత్వ ఆసుపత్రిఓల రెండు వైద్యాధికారులు పోస్టుల ఉన్నప్పటికీ ఒకే వైద్యుడు విధులు నిర్వహిస్తున్నాడు. హనుమాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సంపత్ కుమార్ ఇక్కడ డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పని చేసిన వైద్యాధికారి మసూద్ కరోనా కష్ట కాలంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఉన్నత చదువుల కోసం హనుమాజీపేట వైద్యాధికారిని డిప్యూటేషన్‌పై చందుర్తికి పంపారు. ఈ వైద్యాధికారి కరీంనగర్ నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నారు. శనివారం ఆసుపత్రిని సందర్శించిన ప్రభాతవార్తకు పలు అంశాలు తెలిశాయి. ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఖాళీగా ఉండటంతో ఇతర సిబ్బందితో సేవలు అందిస్తున్నారు. అన్ని రక్త పరీక్షలు చేయకపోవడంతో పలువురు వెనుతిరిగారు. సిహెచ్ఓ డిప్యూటేషన్‌పై వెళ్లారు. హెల్త్ అసిస్టెంట్ పోస్టు కూడా ఖాళీగా ఉంది. హెచ్ఈఓ రెండు పోస్టులు ఉండగా, ఒకటి ఖాళీగా ఉంది. ఫార్మాసిస్ట్ రెగ్యూలర్ పోస్టు ఖాళీగా ఉండటంతో ఆయుష్ఘ ఫార్మాసిస్ట్‌తో సేవలందిస్తున్నారు. ఎల్అండ్‌డి కంప్యూటర్ నుంచి డిప్యూటేషన్‌పై సిరిసిల్లకు పంపారు. చందుర్తి ప్రభుత్వాసుపత్రికి గతంలో జీబు ఉండగా, అట్టి వాహనం తప్పుడు పట్టడంతో డ్రైవర్ పోస్టు ఖాళీగా ఉంది. చందుర్తి ఆరోగ్య కేంద్రం 24గంటల వైద్యశాల కావడంతో రాత్రిపూట స్టాఫ్ నర్స్, ఆయా విధుల్లో ఉంటున్నారు. రాత్రి వేళల్లో డెలివరీలు, ఇతర ప్రమాదాలు జరిగితే వేములవాడ, సిరిసిల్లకు పంపిస్తారు. 24గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం క్వార్టరు నిర్మించగా, అందులో సిబ్బంది ఉండకపోవడంతో అట్టి క్వార్టర్లు శిథిలావస్థకు చేరాయి. చందుర్తి ప్రభుత్వ వైద్య శాలల ఆరు పడకల ఆసుపత్రి కావడంతో పది పడకల ఆసుపత్రిగా మార్చాలని పలువురు ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేయగా, ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వ వైద్య శాల భవనం శిథిలావస్తకు చేరడంతో నూతన భవనానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో నూతన భవ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా చందుర్తి ప్రభుత్వ వైద్య శాలలో ఉన్న సిబ్బంది డిప్యూటేషన్ రద్దు చేసి, ఇక్కడే సేవలందించే విధంగా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. అలాగే వైద్య సిబ్బంది సమయ పాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వైద్యాధికారి శనివారం జిల్లా కేంద్రంలో సమావేశం ఉందని ఆసుపత్రికి రాలేదు. ఇప్పటికైనా పూర్తి స్థాయి వైద్యాధికారిని నియమించి, సేవలందించే విధంగా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.






## పకడ్బందీగా ఆన్‌లైన్‌లో
# కౌంటింగ్ వివరాల నమోదు చేయాలి



మొదటి పేజీ తరువాయి..

శనివారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టర్‌లో ఆన్‌లైన్ ఎన్‌కోర్ వెబ్ సైట్‌లో కౌంటింగ్ వివరాల నమోదు ప్రక్రియ గురించి సంబంధిత కౌంటింగ్ ఆపరేటర్లతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ఫలితాలు సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు భారత ఎన్నికల కమిషన్ ఎన్ కోర్ వెబ్ సైట్ వ్యవస్థ ప్రవేశ పెట్టిందని అన్నారు. కౌంటింగ్ నాడు ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఉన్న 14 టేబుల్స్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు నలుగురు కంప్యూటర్ ఆపరేటర్లను నియమిస్తామని తెలిపారు. ప్రతి టేబుల్ కౌంటింగ్ వివరాలు సదరు ఆపరేటర్లకు వచ్చేందుకు ఆపరేటర్ల వారిగా కలర్ సిస్టం ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి టేబుల్ వివరాలు నమోదు చేసిన తర్వాత సదరు రౌండ్ ఫలితాలను ఫ్రీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఏరౌండ్‌లో ఏదైనా పొరపాటు జరిగినట్లు గుర్తిస్తే సదరు రౌండ్ పలితాల ఫ్రీజ్ తొలగించి, కౌంటింగ్ వివరాలను సరి చేయాలని, తదుపరి రౌండ ఫలితాలు ఆటోమెటిక్‌గా క్యారీ ఫార్వర్డ్ అవుతాయని తెలిపారు. ఈవిఎం ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వివరాలను నమోదు అనంతరం రిటర్నింగ్ అధికారి కౌంటింగ్ పరిశీలకులతో కలిసి పరిశీలించి, తుది ఎన్నికల ఫలితాలను ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, తదితరులున్నారు.

## కరీంనగర్‌లో
# 70 కిలోల గంజాయి పట్టివేత

మొదటి పేజీ తరువాయి..





నగర శివారులోని పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సిఫ్ట్ కారులో ప్రయాణిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిచ్చిన సమాధానం స్పష్టంగా లేకపోవడంతో క్షుణ్ణంగా తనిఖీ చేయగా గంజాయి పెద్ద ఎత్తున తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. గంజాయిని కారు వెనుక సీట్ కింద దాచి ఉంచి రవాణా చేస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. కారులో ఉన్న ముగ్గురి నిందితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్నట్లు తెలిపారన్నారు. నిందితుల్లో ఇద్దరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు కాగా ఒకరు మహారాష్ట్రకు చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. ముగ్గురు నిందితుల్లో విశాఖ జిల్లా కొమ్మాదికి చెందిన సెరకనం రామకృష్ణ, కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన దొడ్డి మణికంఠ, మహారాష్ట్ర జిల్లా పబ్బని బీమ్‌నగరఖు చెందిన ధర్మేంద్రకుమార్ అలియాస్ అన్సారీలుగా గుర్తించి వారిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ 1985 ప్రకారం 8(సీ)ఆర్/డబ్ల్యూ 20(బీ)(ఐఐ)(సీ) సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ గంజాయి పట్టివేతకు కృషి చేసిన 1 టౌన్ ఇన్స్‌పెక్టర్ సరిలాల్, ఎస్సై స్వామితో పాటు సిబ్బందిని టౌన్ ఏసీపీ అభినందించారు.

# నిషేధిత బిటి 3 నకిలీ విత్తనాల పట్టివేత





- పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు - ముగ్గురు నిందితుల అరెస్ట్
- రూ.15లక్షల విలువజేసే 5క్వింటాళ్ల నకిలీ విత్తనాలు స్వాధీనం
- వివరాలను వెల్లడించిన రామగుండం పోలీస్ కమిషనర్

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త.

కల్తీ, నకిలీ విత్తనాల రూపు మాపి రైతుకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాలకు, ఆదేశాలకు అనుగుణంగా రైతులను నట్టేట ముంచుతున్న నకిలీ విత్తనాల సరఫరా జీరో స్థాయికి తీసుకు రావడం, సమూలంగా నిర్మూలించడమే లక్ష్యంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ టాస్క్ ఫోర్స్ బృందాలు, స్థానిక పోలీసు అధికారులు, సిబ్బంది పని చేస్తున్నారని రామగుండం సిపి ఎం.శ్రీనివాస్ తెలిపారు.

రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ నెన్నాల్ మండలం బొప్పారం గ్రామంలోని కర్నకొండ చంద్రశేఖర్ తన ఇంటి ఆవరణలో నిషేధిత బిటి 3 నకిలీ పత్తి వితనాలు అక్రమంగా నిల్వ చేసి, అమాయక రైతులకు మాయ మాటలు చెప్పి అమ్ముతున్నాడనే నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సంజయ్, ఎస్ఐ లచ్చన్న సిబ్బందితో కలిసి ఇంటి ఆవరణలో తనిఖీలు చేయగా, సుమారు 15లక్షల విలువైన 5 క్వింటాళ్ల ప్రభుత్వ నిషేధిత బిటి 3 నకిలీ విత్తనాలు గుర్తించడం జరిగిందని తెలిపారు. అనంతరం అతన్ని విచారించగా విత్తనాలు బైంసాకు చెందిన రజాక్, మందమర్రికి చెందిన జానీ అనే వారి వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేశామని, పత్తి విత్తనాలు సొల్లు పెదయ్య అలియాస్ సురేష్ అక్రమంగా రవాణా చేసి తనకు అందజేశాడని, పత్తి విత్తనాలు అమాయక రైతులకు ఎక్కువ ధరకు అమ్మేందుకు నిల్వ ఉంచామని తెలిపారు. 5 క్వింటాళ్లలో సూరం దిలీప్, కల్లూరి వెంకటేశంలకు కూడా భాగం ఉందని, వీరిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు మొత్తం ముగ్గురు కర్నకొండ చంద్రశేఖర్, సూరం దిలీప్, కల్లూరి వెంకటేశంను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి ఒక మొబైల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తదుపరి విచారణ నిమిత్తం నిందితులు, నకిలీ విత్తనాలను నెన్నాల్ పోలీసులకు అప్పగించడం జరిగిందని తెలిపారు. రైతులను నమ్మించి మోసం చేసి నకిలీ విత్తనాలను విక్రయిస్తే సహించేది లేదని, ఎవరైనా నకిలీ విత్తనాలను, విక్రయించిన, సరఫరా చేసిన వారిపై పిడి యాక్ట్‌కేసు నమోదు చేయడం జరుగుతుందని, ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు సమాచారం అందితే తక్షణమే సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# తాళం వేసిన ఇంట్లో చోరీ

వెల్గటూర్,ప్రభాతవార్త :

తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు.ఈ ఘటన శుక్రవారం వెల్గటూర్ మండలం కేంద్రంలో చోటు చేసుకుంది.శనివారం బాధితులు తెలిపిన వివరాల ప్రకారం జీవనోపాధి కోసం గుమ్ముల నరేష్ ముంబైకి వెళ్లాడు.వేసవి సెలవులు రావడంతో నరేష్ భార్య పిల్లలతో కలిసి ముంబై వెళ్లింది.ఇదే అలుసుగా తీసుకున్న దుండగులు ఇంటికి వేసిన తాళం పగలగొట్టి ఇంటిలోకి చొరబడి బీరువా తాళం పగలగొట్టి బట్టలు చిందరవందరగా పడేసి ఉండడాన్ని గుర్తించిన నరేష్ సోదరులు ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో సుమారు 3.5 తులాల బంగారం చోరీ జరిగినట్లు గుర్తించారు.కాగా అదే రాత్రి పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో మెయిన్ రోడ్డు దుబ్బలవాడ సమీపంలో పాత హీరో షోరూం వెంకటేశ్వర ఆటోమొబైల్స్ షాపు వెనుక షెటర్‌ను దుండగులు పగలగొట్టడానికి ప్రయత్నించారు.కాగా తుపుకారి శివాజీ ఇంటి ముందట ఉన్న ద్విచక్ర వాహనాన్ని దుండగులు ఎత్తుకెళ్లి పెట్రోల్ అయిపోయిన క్రమంలో ద్విచక్ర వాహనాన్ని మధ్యలో వదిలేసి వెళ్లిపోయారు.అలాగే జోగం చిలుకలయ్య ఇంట్లో దొంగిలించేందుకు ప్రయత్నం చేసిన దుండగులకు ఏమి దొరకకపోవడంతో వెళ్లిపోయారు.ఒకటే రోజు నాలుగు చోట్ల దొంగతనాలు జరగడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.బాధితుల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్లూస్ టీం సభ్యులు దొంగతనాలు జరిగిన ఇండ్లను పరిశీలించి వివరాలను సేకరిస్తున్నారు.సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తంగళ్ళపల్లి, ప్రభాతవార్త.



తంగళ్ళపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన పెద్ది మల్లేశం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా, చికిత్స పొందుతూ శనివారం రోజున మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే... కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండేపల్లి గ్రామానికి చెందిన పెద్ది మల్లేశం మే 22వ తేదీ బుధవారం రోజున మండేపల్లి నుంచి తంగళ్ళపల్లి వైపు తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, మండేపల్లి గ్రామ శివారులో మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లడంతో అతనికి తీవ్ర గాయాలు కాగా, కుటుంబ సభ్యులు హుటాహుటిన కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య శికిత్స అందించగా, సుమారు 10 రోజులుగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

# రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

-- యజమానులపై కేసు నమోదు

వీణవంక, ప్రభాత వార్త:

వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బండారి రమేష్, ఐలవేని అనిల్ లు అదే గ్రామ మానేరు వాగు నుండి అక్రమంగా ఇసుకను తమ ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుండగా మండలంలోని నర్సింగాపూర్ వైపు గస్తీకి వెళ్ళిన పోలీసులకు ఆ రెండు ట్రాక్టర్లు ఎదురుకావడంతో యాజమానులతో ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్ కు తరలించి ట్రాక్టర్లతో యాజమానుల పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

# వ్యవసాయ మోటర్లు చోరీ

**చిలుకూరు, జూన్ 01 ప్రభాతవార్త :** మండలంలోని బేతవోలు ఆవాస గ్రామ సీతారాంతండ సమీపంలో పది వ్యవసాయ మోటర్లు చోరీకి గురైన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. బాదితులు తెలిపిన వివరాల ప్రకారం రణబోతు అమర్‌నాద్‌రెడ్డి, దేశబోయిన మల్లేష్, దేశబోయిన శ్రీను, గంగబోయిన కట్టయ్య, బానోత్ పాషా, బానోత్ వెంకటేశ్వర్లు, కేశగాని వీరయ్య, బెల్లంకొండ శంకర్, బెల్లంకొండ అంజయ్యలకు సంబంధించిన తమ వ్యవసాయ భూముల వద్ద ఉన్న మోటర్లను గుర్తు తెలియని వ్యక్తులు రాత్రిపూట దొంగిలించినట్లు వారు తెలిపారు. ఒక్కోక మోటరు విలువ సుమారు 35,000 వేల రూపాయల నుండి 40,000 వేల వరకుఉంటుందని తెలిపారు. ఇటి విషయం పై చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో బాదిత రైతులు ఫిర్యాద్ చేశారు. మోటర్లు దొంగిలిచిన వారిని పట్టుకొని తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు.

# నేరాలు-దారుణాలు

## వేధింపులు భరించలేక వ్యక్తి ఆత్మహత్య

వీణవంక, ప్రభాత వార్త:

వీణవంక మండలం బొంతుపల్లి గ్రామానికి చెందిన చదువు వాసుదేవ రెడ్డి ని అదే గ్రామానికి చెందిన చదువు నర్సింహా రెడ్డి తో పాటు కొరుగంటి ఓదెలు, జునుతుల మనోహార్ రెడ్డి, జునుతుల మంజుల, కోరుగంటి శంకర్ లు పాత పగలు దృష్టిలో ఉంచుకొని ఎలాగైనా ఇబ్బంది పెట్టాలని వాసుదేవ రెడ్డి అదే గ్రామానికి చెందిన కోరుకంటి శారదను శారీరకంగా వాడుకొని వివాహం చేసుకోనందున 20 గుంటల భూమితో పాటు 5 లక్షల రూపాయల నగదు ఇవ్వాలని బలవంతంగా సంతకం పెట్టించి మానసికంగా వేదించినందున వారి వేధింపులు భరించలేక ఈనెల 25న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయానికి పాల్పడగా గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని కుమారుడు వినయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి శనివారం తెలిపారు.

## పాముకాటుతో బాలిక మృతి

పెద్దపల్లి, ప్రభాతవార్త.




పెద్దపల్లి పట్టణంలోని సాగర్ రోడ్డుకు చెందిన నిట్టూరు వైష్ణవి (11) శుక్రవారం రాత్రి పాముకాటుతో మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ఇంట్లో ఫ్రిడ్జ్ డోర్ తీసి నీళ్ల సీసా తీసుకునే క్రమంలో ఫ్రిడ్జ్ కింద నుంచి వచ్చిన పాము కాటు వేసిందని, ఎలుక కొరికి ఉంటుందని భావించిన కుటుంబ సభ్యులు బాలికను పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుత బాలిక మృతి చెందింది.

## బద్దెనపల్లి గ్రామ శివారులో రోడ్డు ప్రమాదం

- ఆటో, బైక్ ఢీ

తంగళ్ళపల్లి, ప్రభాతవార్త.



జనగాం జిల్లా బచ్చన్నపేట మండలం సాల్వాపూర్ గ్రామానికి చెందిన చిట్యాల గణేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి మాల విరమణ కొరకై కొండగట్టుకు వెళ్లి తిరుగు ప్రయాణం అవుతుండగా, తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి గ్రామ శివారులో రోడ్డు జరిగింది. ఎదురుగా వస్తున్న ఆటో వీరి బైక్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిని 108 వాహనంలో టెక్నీషియన్ ప్రవీణ్, పైలెట్ నరేష్‌లు ప్రథమ చికిత్స అందిస్తూ జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో 22 సంవత్సరాల పూజా, 16 సంవత్సరాల జస్వంత్, 19 సంవత్సరాల ఆటో డ్రైవర్ రాకేష్, 20 సంవత్సరాల మధు ఉన్నారు. వీరు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

## సైబర్ నేరగాళ్ల మోసానికి రూ. 27వేలు మాయం

గంభీరావుపేట, ప్రభాతవార్త:

సైబర్ నేరగాళ్ల మోసానికి రూ. 27వేలు మాయమయిన సంఘటన గంభీరావుపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన కామిడి సంజీవరెడ్డి స్థానిక యూనియన్ బ్యాంక్ నందు ఖాతా కల్గి ఉండగా అందులోని రూ. 27 వేలు గురువారం రాత్రి సైబర్ నేరగాళ్ల మోసానికి ఖాతా నుండి డబ్బులు డ్రా కావడంతో అవక్కయ్యారు. ఖాతాదారునికి ముందుగా సైబర్ నేరగాళ్లు ఏపీకే పేరిట లింకు పంపించడం అది ఓపెన్ చేయగానే ఖాతాలోని డబ్బులు మాయమయినట్లు ఖాతాదారుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం బ్యాంక్ మేనేజర్‌కు సమాచారాము అందచేశారు. యూనియన్ బ్యాంక్ ఖాతాదారులనే టార్గెట్ చేసి సైబర్ నేరగాళ్లు మోసానికి పాల్పడుతుండడం ఖాతాదారులు భయందోళన చెందుతున్నారు. యూనియన్ బ్యాంక్ ఖాతాదారులకు వచ్చే ఏలాంటి లింకులు కాని ఓపెన్ చేయకూడదని బ్యాంక్ మేనేజర్ రవి ఈ సందర్భంగా పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల మోసాల పట్ల ఖాతాదారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## సేవాదల్ జిల్లా కార్యదర్శిగా సాయికృష్ణ

*కోరుట్ల టౌన్, ప్రభాతవార్త*



కాంగ్రెస్ సేవాదళ్ జగిత్యాల జిల్లా కార్యదర్శిగా పట్టణానికి చెందిన గడ్డం సాయికృష్ణను నియమిస్తూ జిల్లా కా ంగ్రెస్ సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్ అందె మారుతిబాపూజి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కోరుట్ల పట్టణ ఎన్ఎస్‌యూఐ కార్యదర్శిగా పనిచేసి ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్న సాయికృష్ణ సేవలను గుర్తించి కాంగ్రెస్ సేవాదళ్ జగిత్యాల జిల్లా కార్యదర్శిగా నియమించినట్లు మారుతి తెలిపారు. నూతనంగా ఎన్నికైన సాయికృష్ణ మాట్లాడుతూ తన నియమాకానికి సహకరించిన ఎమె ్మల్సీ జీవన్‌రెడ్డి, కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జీ జువ్వాడి నర్సి ంగరావు, రాష్ట్ర నాయకులు కృష్ణారావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, టీపీసీసీ కార్యదర్శి శేర్ నర్సా రెడ్డి, ఆర్గనైజర్ మారుతి, పట్టణాధ్యక్షుడు తిరుమల గంగాధర్‌గౌడ్, మండలాధ్యక్షుడు కొంతం రాజం, కిసాన్ అధ్యక్షుడు శ్రీరాముల అమరేందర్, భూమయ్యలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

## అగ్నిప్రమాద సంఘటన స్థలాన్ని పరిశీంచిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

*రాయికల్, ప్రభాతవార్త:*



మండలంలోని కుమ్మరిపెల్లిలో ప్రమాదవ శాత్తు అగ్నికి ఆహుతి అయిన సంఘట స్థలాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శనివారం పరిశీలించారు. అంబల్ల ప్రతాప్‌రెడ్డికి చెందిన కోళ్ళఫారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఆహుతి కాగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితుడికి సానుభూతి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పరంగా తనను ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట రవీందర్‌రావు, గోపిరాజు, గుర్రం మహేందర్‌గౌడ్, చింతలపల్లి గంగారెడ్డి, కొయ్యడు మహిపాల్‌రెడ్డి, రమేష్, ప్రసాద్, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మగౌరవం ఇప్పుడు గుర్తొచ్చిందా..?

### 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్

*జగిత్యాల బ్యూరో,ప్రభాతవార్త :*



రాష్ట్ర గీతం సంగీతం కూర్పుపై నా,రాష్ట్ర చిహ్నం మార్పు చేర్పులపైన విమర్శలు చేస్తున్న కొందరు మేధావులకు ఆత్మగౌరవం ఇప్పుడు గుర్తొచ్చిందా? అని 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘ జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది హరి అశోక్ కుమా ర్ ప్రశ్నించారు.శనివారం ఆయన జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ అశేష తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కోసం రాష్ట్ర గీతం ప్రకటించాలని గత పదేళ్లుగా ఎన్నడూ కోరని ఈ మేధావులు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయాలను విమర్శించడం సమంజసమేనా?వారు ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు.కాకతీయుల స్వాగత తోరణం,చార్మినార్ తెలంగాణ సమాజానికి పాక్షిక ప్రతిభింబాలే కానీ పరిపూర్ణం కానేరవన్నారు .చెరువులు,తవ్వించి,నీటి వసతులు కల్పించినంత మాత్రాన దయా ప్రభువులు కారని,సమ్మక్క,సారక్కను హతమార్చిన రక్తచరిత్ర కూడా వారిదేనన్నారు.నిజాం పరిపాలన మొత్తం నియంతృత్వ,దౌర్జన్యాలతో కూడినదేనని వారు మరచి పోయారా? గత దశాబ్ద కాలంగా నోరు తెరవని వారు వ్యూహాత్మక వైఖరిని అవలంభించి ఇప్పుడు ప్రస్తుత ప్రభుత్వ హాయంలో గౌరవ,మర్యాదల గురించి మాట్లాడితే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించిన మాలాంటి తెలంగాణ వాదులం చింతిస్తున్నామన్నారు.జిల్లా ప్రతినిదులు గౌరిశెట్టి విశ్వనాథం,వెలముల ప్రకాష్‌రావు,జనార్ధన్,నర్స య్య,పబ్బా శివానందం,తదితరులున్నారు.

## విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి

*భూపాలపల్లి, జూన్01, ప్రభాతవార్త*



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ప్రాంత కార్య సమితి సభ్యులు వేల్పుల రాజుకుమార్ డిమాండ్ చేశారు. శనివారం సమస్యలతో కూడిన వినతి పత్రంను ఎంఎల్ఎ గండ్ర సత్య నారాయణరావుకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో మౌళిక సమస్యలు పరిష్కరించాలని, విద్యార్థుల కోసం హాస్టల్ వసతి, నీటి సౌకర్యం కల్పించాలన్నారు. చిట్యాల మండల కేంద్రంలో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహంలో పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని, అదే విధంగా డిగ్రీ కాలేజిని ఏర్పాటు చేయాలని కోరారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మైనింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరగా ఎంఎల్ఎ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. నాయకులు వికాస్, శివాజీ, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాజముద్రను మార్చొద్దు

### -మార్కెట్ మాజీ చైర్మన్ బండి సారంగపాణి

*పరకాల,జూన్ 1, ప్రభాతవార్త*



తెలంగాణ రాజముద్రలో కాకతీయ కళాతోరణం ,చార్మి నార్‌లను తొలగించొద్దని పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి సారంగపాణి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర ఉన్న కాకతీయ కళాతోరణాన్ని, చార్మినార్‌లను తొలంగిచే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. అమరవీరుల స్థూపం, బతుకమ్మ పెట్టాలనుకుంటే ఉన్న వాటిని తీయకుండా పెట్టొచ్చన్నారు.ప్రభుత్వ నిర్ణయాలు ఎప్పుడూ ప్రజల ఆమోదయోగ్యంగా ఉండాలే తప్ప ప్రజా వ్యతిరేకంగా ఉండకుడదన్నారు.పదేళ్లలో ఎన్నో త్యాగాలు,పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలో దశాబ్ధి ఉత్సవాలు పండుగ వాతావరణంలో జరగాలన్నారు. చార్మినార్‌ను తొలగించటమంటే ప్రతి హైదరాబాదీని అవమానపర్చినట్టే. ప్రతి ఒక్కరిని అగౌరవపరిచినట్లేనని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నది ప్రజల బతుకులు మార్చామని,మేలు చేయమని,పథకాలు అమలుచేయమని,ఇలాంటి మూర్ఖపు నిర్ణయాలు విరమించుకోవాలని కోరారు.ప్రజలు,తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగగా వ్యవహరించవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సంస్కృతికి ప్రతీకగా శాతవాహనులు, కాకతీయులు, బహుమనీయులు, కుతుబ్‌షాహీలు, విజయనగర రాజులు, గోల్కొండ నవాబులు పాలించిన కాలంలోని అంశాలను భవిష్యత్తు తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం ప్రజాభిప్రాయం మేరకు లోగోను రూపొందిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ సంస్కృతికి తూట్లు పొడుస్తూ సంప్రదాయాలను మట్టిపాలు చేస్తుందన్నారు. ఉద్యమకారుల బలిదానాల మీద ఏర్పడిన రాష్ట్ర లోగోను మార్చే విషయాన్ని ప్రభుత్వం పునరాలోచించి,రాజకీయాలకతీతంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి

*పినపాక, జూన్ 01, ప్రభాతవార్త*

శ్రీ హనుమాన్ జయంతి వేడుకలు మండలంలో పలు దేవాలయాల్లో, అంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం విశేష అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడి ధరించారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అంజన్నకు ప్రత్యేక పూజలు జరిగాయి. మల్లారం, జానంపేట, దుగినేపల్లి, సీతంపేట, పినపాక గ్రామాల్లో ఆయా దేవాలయాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు.

# కోరుట్ల వార్త

## ఘనంగా పెద్దహన్మాన్ జయంతి వేడుకలు

*కోరుట్ల, ప్రభాతవార్త*



పట్టణంలోని ఆనంద్‌నగర్‌లో గల శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో పెద్ద హన్మాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆలయంలో ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, యాగం నిర్వహించారు. ఈవేడుకల్లో మున్సిపల్ చైర్మెన్ అన ్నం లావణ్యఅనీల్, కౌన్సిలర్లు జిందం లక్ష్మీనారాయణ, గంధం గంగాధర్, సంగ మాలతిలింగంలు పాల్గొని పూజలు నిర్వహించుకోగా ఆలయ పక్షాన ఘనంగా సన్మానించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఆంజనేయస్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకోగా భక్తులందరికీ మహాఅన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గుంటుక జ్ఞానేశ్వర్, గుంటుక మహేష్‌లతో పాటూ ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఉచిత కోచింగ్ బ్రోచర్ విడుదల

*కోరుట్ల అర్బన్, ప్రభాతవార్త*



పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంకామ్ పీజీ ఎంట్రెన్స్‌కు రాష్ట్రస్థాయి ఉచిత కోచింగ్ బ్రోచర్‌ను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి వాసవి మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉచితంగా ఎంకామ్ పీజీ ఎ ంట్రెన్స్ కోచింగ్‌ను అందించడానికి కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఖమ్మంలోని ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు సంయుక్తంగా ఆన్‌లైన్‌లో రాష్ట్ర స్థాయి కోచింగ్ అందించడానికి సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశామన్నారు. ఈ రాష్ట్ర స్థాయి ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళాశాలల నుండి 12మంది కామర్స్ అధ్యాపకుల బృందం 20రోజుల పాటూ ఆన్‌లైన్ కోచింగ్‌ను అందిస్తారని, ఈ ఆన్‌లైన్ కోచింగ్‌కు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలకు చెందిన 310మంది విద్యార్థులు కోచింగ్ కొరకు పేర్లునమోదు చేసుకున్నారన్నారు. విద్యార్థులు ఈ ఉచిత ఆన్‌లైన్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ బూర్ల నరేష్, డాక్టర్ సుఖప్రదదేవి, కళాశాల అధ్యాపకులు నీరజ, మల్లికార్జున్, నాగరాజు, విజేత, రాజశేఖర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుతో టీడీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం

*కోరుట్ల, ప్రభాతవార్త*



టీడీపీ అధినేత కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తెలంగాణ టీడీపీ పిలుపు మేరకు చంద్రబాబు నివాసంలో 50మంది ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కోరుట్ల నియోజకవర ్గ టీడీపీ ఇంచార్జీ మానుక ప్రవీణ్‌కుమార్ చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలుగు ప్రజలకు గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తానని, ఇక నుండి తెలంగాణ రాజకీయాలకు సమయం కేటాయిస్తామని చంద్రబాబు తెలిపారన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో సైతం టీడీపీ పోటీ చేస్తుందని నేతలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జగిత్యాల వార్త



# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

వెల్గటూర్,ప్రభాతవార్త :



వెల్గటూర్ మండల కేంద్రంలో శ్రీరామ భకాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.ఆలయ అర్చకులు వకులాభరణం నరసింహ స్వామి ఆంజనేయ స్వామికి ఉదయం విశేష అభిషేక పూజలతో పాటు పంచ కుండాత్మక హనుమాన్ కవచహవనం పూజలు, శివాలయంలో అభిషేకాలు నిర్వహించారు .శ్రీశ్రీశ్రీ హరి మౌన స్వామి రోటి గూడ వారి ఆధ్వర్యంలో అష్టాదశ (18) కుండములచే యజ్ఞాలను నిర్వహించారు.గీతా పారాయణ భక్తులచే గీతాపారాయణం ఘనంగా నిర్వహించారు.ఇట్టి యజ్ఞ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.హనుమాన్ జయంతి ముగింపు సందర్భంగా పలువురు ఆంజనేయ స్వామి భక్తులు మాల విరమణ చేశారు.ఆలయ కమిటీ ఆద్వర్యంలో ఆలయ అభివృద్ధికి సహకరించిన వారిని స్వామి వారి చిత్రపటంతో పాటు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మెరుగు మురళి గౌడ్,ఆలయ కమిటీ చైర్మన్ మెరుగు నరేష్‌గౌడ్,కోశాధికారి జుపాక కిరన్, ఆలయ అర్చకులు వకులాభరణం, నరసింహస్వామి ,వకులాభరణం వెంకటేష్, రవి,మాజీ ఉపసర్పంచ్ గుండాటి సందీప్‌రెడ్డి, గండ్ర శ్రీకాంత్‌రావు,సాగాని శ్రీనివాస్,సంకోజు నరేష్, గుమ్ముల సతీష్,కస్తూరి తిరుమల్లేష్, గుమ్ముల అజయ్,దీక్ష స్వాములు,తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

ధర్మపురి,ప్రభాతవార్త :



ధర్మపురి క్షేత్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకల్ని శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో అర్చకులు ఉదయం వేళలో స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం మన్యసూక్త పారాయణం,సుందరకాండ పారాయణం,తదితర కార్యక్రమాలను నిర్వహించారు.స్థానిక హనుమాన్ దీక్షాపరులతో పాటు పాటు వివిధ ప్రాంతాల నుండి క్షేత్రానికి వచ్చిన హనుమాన్ భక్తులు గోదావరి స్నానాలు ఆచరించి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంతో పాటు లక్ష్మి నరసింహ స్వామి ఆలయాన్ని దర్శించుకొని పూజలు నిర్వహించారు.ఆంజనేయ స్వామి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో క్షేత్రమంతా కాషాయంతో నిండిపోయింది.భక్తుల సౌకర్యం కోసం దేవాలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు,క్యూలైన్లు,మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.గోదావరి తీరాన మంగళ గడ్డ ఘాట్ వద్ద చలువ పందిళ్లు,తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు.ఉదయం నుండి రాత్రి వరకు క్షేత్రంలో హనుమాన్ భక్తుల సందడి కనిపించింది.ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో శ్రీనివాస్,స్థానిక ప్రజాప్రతినిధులు,దేవస్థానం అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్దలతో అంజన్న జయంతి

గొల్లపల్లి,ప్రభాతవార్త :



మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో ఆంజనేయ స్వామి జయంతి వేడుకలు నిర్వహించారు.భీమ్‌రాజ్‌పల్లి గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆంజనేయ స్వామి జయంతిని భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా అర్చకులు అయ్యోరి నర్స య్య,తిరుణహరి సత్యనారాయణలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు తమ మొక్కు బడులు చెల్లించుకున్నారు.వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని భక్తులు కోరుకున్నారు.భక్తులకు తీర్థ ప్రసాదం, అన్నప్రసాదం అందించారు బీంరాజ్‌పల్లి ఆలయ ధర్మకర్త చింతపండు శశికళ తిరుపతిరెడ్డి,భక్తులు కళ్లెం స్వామి రెడ్డి,పెంచాల స్వామి, కట్ట క్రాంతి,చౌటపల్లి తిరుపతి,కిషన్,సత్తన్న,రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కందుకూరి కృష్ణారెడ్డి,ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మెన కుమార్ ,ప్రదాన కార్యదర్శి సాగర్,కంది స్వామి,మాజీ సర్పంచ్ రేవెళ్ల సుజాత, లింగయ్య, సింగారపు లచ్చయ్య,బొమ్మెన వెంకటేశం,సామల రవి, ప్రసాద్ , బొమ్మెన నరేందర్,చింతల రవీందర్,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉచిత కోచింగ్ గడువు మరో నెల పెంచాలని ఉప ముఖ్యమంత్రికి

### ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ వినతి

జగిత్యాల బ్యూరో,ప్రభాతవార్త :



డిఎస్సీ -2024కు హాజరయ్యే ఎస్సీ,ఎస్టీ,బిసి నిరుద్యోగ యువతకు ఉచిత కోచింగ్‌ను మరో నెల రోజుల పాటు పొడిగించాలని జగిత్యాల జిల్లా పోలీస్ కానిస్టేబుల్లకు సంబంధించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, హైదరాబాద్ పర్యటనలో ఉన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం రోజున రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి పలు అంశాలపై వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిఎస్సీ-2024కు హాజరయ్యే ఎస్సీ,ఎస్టీ,బిసి నిరుద్యోగ యువతకు ఉచిత కోచింగ్‌ను మరోనెల రోజుల పాటు పొడిగించాలని ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరడం జరిగిందని,రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువతుక పెద్ద ఎత్తున ఉపాధి కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తోందని ఈ నేపథ్యంలో ప్రభుత్వం డిఎస్సీ-2024 నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని,దానికి సంబంధించిన డిఎస్సీ పరీక్ష జూలై నెలలో నిర్వహించడం జరుగుతుందని, అట్టి డిఎస్సీ 2024 పరీక్షకు హాజరయ్యే ఔత్సాహిక ఎస్సీ,ఎస్టీ,బిసి అభ్యర్థులకు రెండు నెలల పాటు ఉచిత కోచింగ్ ఇవ్వాలని ప్రభుత్వం,నిర్ణయం తీసుకోవడం జరిగిందని,జగిత్యాల,కరీంనగర్ జిల్లాలోని అనేక మంది ఎస్సీ,ఎస్టీ,బిసి నిరుద్యోగ యువత కోచింగ్‌ల వ్యవధిని మరో నెల రోజులు పొడిగించేలా చూడాలని తన దృష్టికి తీసుకురావడం జరిగిందని,ఎస్సీ,ఎస్టీ,బిసి నిరుద్యోగ యువతలో ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని,డిఎస్సీ 2024 కోసం తెలంగాణ స్టడీ సర్కిల్‌లలో ఉచిత కోచింగ్ వ్యవధిని మరోనెల పాటు పొడిగించాలని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగిందని,అదే విధంగా జగిత్యాల జిల్లా పోలీస్ కానిస్టే బుల్లకు సంబంధించి పెండింగ్ బిల్లులను కూడా విడుదల చేయాలని వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని,ఈరెండు అంశాలపై వారు సానుకూలంగా స్పందించడం జరిగిందని,డిఎస్సీ అభ్యర్థులకు సంబంధించిన అంశంపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని,కానిస్టేబుల్ల బిల్లుల అంశంపైన కూడా పెండింగ్ బిల్లులను త్వరలోనే విడుదల చేస్తామని తెలపడం జరిగిందని ఈ సందర్భంగా తెలిపారు.

## హనుమాన్ చాలీసా భక్త బృందం ఆధ్వర్యంలో ఘనంగా

### హనుమాన్ జయంతి వేడుకలు-ప్రత్యేక పూజలు

జగిత్యాల బ్యూరో,ప్రభాతవార్త :

బ్రాహ్మణ వీధి హరిహరాలయంలో హనుమాన్ చాలీసా భక్త బృందం ఆధ్వర్యంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శనివారం రాత్రి 7 గంటలకు విశేష సంఖ్యలో మహిళలు భక్తులు పాల్గొని హనుమాన్ చాలీసా పారాయణం, భక్తి పాటలతో భజనలు అంగరంగ వైభవంగా ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళహారతులు సమర్పించారు. హనమాన్ చాలీసా భక్త బృందం,సభాపతి తిగుళ్ల సూర్య నారాయణ శర్మ, సంగనబట్ల నరేందర్‌శర్మ,కంజర్ల అనంతచారి,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితుని కుటుంబానికి ఆర్థిక సాయం

### అందించిన కమలాకర్ రెడ్డి

కొడిమ్యాల,ప్రభాతవార్త :



కొడిమ్యాల మండలం డబ్బు తిమ్మయ్యపల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఒడ్నాల రాజయ్య బార్య మల్లవ్వ అనారోగ్యంతో మరణించగా మృతుని కుటుంబాన్ని ఏలేటి కమలాకర్‌రెడ్డి శనివారం పరామర్శించి పదివేల రూపాయలు ఆర్థికసాయం అందించారు.వారి వెంట సురకంటి ముత్యంరెడ్డి, గోల్కొండ రాజు,చందు,మహిపాల్,సాయి, పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి బియ్యం వితరణ

భీమారం,ప్రభాతవార్త :



భీమారం మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన పస్తం రాజం గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మరణించగా నిరుపేద కుటుంబం కావడంతో ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి రావడంతో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ 50 కిలోల బియ్యం కాంగ్రెస్ పార్టీ సభ్యులతో అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్‌పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాజారాంపల్లిలో ఫెర్టిలైజర్ షాపు తనిఖీలు

ఎండపల్లి,ప్రభాతవార్త :

జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలోని రాజారాంపల్లిలో శుక్రవారం రోజున వెల్గటూర్ ఎండపల్లి ఉమ్మడి మండలంలోని ఉమామహేశ్వర పెర్టిలైజర్ షాపు,హనుమాన్ ఫర్టిలైజర్ షాపులో బుక్స్ స్టాక్ రిజిస్టర్లు బిల్స్ తనిఖీలు నిర్వహించారు.అగ్రికల్చరల్ కరుణ మాట్లాడుతూ మన ఎండపల్లి మండలంలో రైతులకు విత్తనాల కొరత కానీ ప్రాబ్లం ఏమి లేదని రైతులు నేరుగా లైసెన్స్ ఉన్న షాపులో తీసుకోవాలి.విత్తనాలు తీసుకున్నప్పుడు రాసింది తప్పనిసరిగా తీసుకోవాలి.రసీదు పంట పూర్తి అయ్యే వరకు రసీదును జాగ్రత్త పరుచుకోవాలి పంటల ఏమైనా తేడా గాని వచ్చినచో రైతులకు నేరుగా డబ్బులు ఇప్పించబడునని తెలిపారు.ఈ కార్యక్రమంలో అగ్రికల్చరల్ సిబ్బంది,ఎండపల్లి మండల తహశీల్దార్,పోలీస్ డిపార్ట్మెంట్ పాల్గొన్నారు.



## కొండ్రికర్ల బ్రిడ్జీ కాకపాయే..రాసిచ్చిన బాండ్ పేపర్ మర్చిపాయే





**మెట్‌పల్లి అర్బన్, ప్రభాతవార్త:**
కొండ్రికర్ల బ్రిడ్జీ కాకపాయే.. రాసిచ్చిన బాండ్ పేపర్ మర్చిపాయే అని ఎద్దెవ చేస్తూ కాంగ్రెస్ నాయకుడు బత్తుల భరత్ బీఆర్ఎస్ పార్టీ నాయకులను విమర్శించారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో బత్తుల భరత్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలుగా చేస్తున్న అభివృద్ధి చూడలేకనే విమర్శలు చేస్తున్నామని బీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. మండలంలోని కొండ్రికర్ల బ్రిడ్జీ కోసం మాజీ ఎమ్మెల్యే బాండ్ పేపర్ రాయించి ఆరు సంవత్సరాలు గడుస్తున్న బ్రిడ్జీ ఇప్పటి వరకు పూర్తికాకపోవడం మీరు చేసినా అభివృద్ధా అని ఎద్దెవ చేశారు. వంద రోజులలో షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తానని చెప్పి ఈనాటి వరకు హామీ నెరవేర్చుకోలేని అసమర్ధత పాలన అని విమర్శించారు.

మాజీ ఎమ్మెల్యే ఖాదీ బోర్డు చైర్మన్ కాగానే ఖాదీ భూములు అమ్ముకోవడం, ఖాదీ బిల్డింగ్‌లకు మున్సిపల్ పన్నులు కట్టకపోవడం, దళిత బంధులో కమీషన్ తీసుకోవడం మీరు చేసినా అభివృద్ధా అని అన్నారు. ఈ పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి జరిగింది ఏమీ లేదని, అభివృద్ధి జరిగి ఉంటే బీఆర్ఎస్ పార్టీ నుండి ఇంత మంది కాంగ్రెస్ పార్టీలోకి వలస వచ్చే వారు కాదని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నియోజక అభివృద్ధి జరుగుతుందని అభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వడానికే కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరానని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే షుగర్ ఫ్యాక్టరీ తెరిపించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్ బాబుతో కమిటీ వేయడం జరిగిందని అన్నారు. త్వరలోనే షుగర్ ఫ్యాక్టరీ తెరిపించుకోవడం జరుగుతుందని తెలిపారు. జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడుతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేకల నరేష్, బత్తుల నరేష్, ఎన్నం రమేష్, దాసం నాగరాజ్, జక్కం భూమేష్, ముత్తునూరి సురేష్, పొట్ట రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా వనప్రభ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట కానుంది

**మెట్‌పల్లి అర్బన్, ప్రభాతవార్త:**
ఇందిరా వనప్రభ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట కానుందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జెట్టి లింగం అన్నారు. స్థానిక విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారం అనే పేరుతో కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని వృతా చేసిందని, కాంగ్రెస ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావు ఆధ్వర్యంలో అధికార యంత్రాంగాన్ని,



ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులను, అన్ని ప్రజా సంఘాలను, యువతను, ప్రజలను కలుపుకొని ఇందిర వనప్రభ కార్యక్రమం కోసం సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, అటవీశాఖ సిబ్బంది పని చేయాల్సి ఉంటుందని, విత్తనాలు మొదలు కొని, మొక్కల పెంపకం, మొక్కల సరఫరా, పంపిణీ విధానం, మొక్కల నాటడం, వాటి పరిరక్షణ మొదలగు సంబంధిత పనులను పకడ్బందీగా ప్రభుత్వం నిర్వహించనున్నదని ఆయన పేర్కొన్నారు.

## ముగిసిన అథ్లెటిక్స్ వేసవి శిబిరం



**మెట్‌పల్లి, ప్రభాతవార్త:**
జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన వేసవి శిబిరం ముగియడంతో చిన్నారులకు ప్రశంస పత్రాలను అందజేశారు. నెల రోజుల శిబిరంలో చిన్నారి విద్యార్థులకు రన్నింగ్, లాంగ్ జంప్, షాట్ పుట్, డిస్కస్ త్రో, జావలిన్ త్రో, స్టాండింగ్ బ్రాడ్, జంప్ వివిధ అంశాలపై శిక్షణను అందించి సర్టిఫికేట్‌లను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విబి మహర్షి మాట్లాడుతూ చిన్నారి విద్యార్థులు చిన్నతనం నుండి క్రీడలపై దృష్టి సారించాలని క్రీడల వల్ల చదువులో గానీ ఉద్యోగంలో గాని మన రాష్ట్రంలో 2 శాతం రిజర్వేషన్ కల్పించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలు నేర్చుకొని చిన్నతనం నుండి ఆడాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ ఏలేటి ముత్తయ్యరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గజాలి రాందాస్, కోచ్ మరిపల్లి కార్తీక్, ఫిజికల్ డైరెక్టర్ ఆల్‌రౌండర్ గంగాధర్, జ్ఞానోదయ కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విత్తనాల దుకాణాలలో విస్తృత తనిఖీ

**బోయినిపల్లి, ప్రభాత వార్త:**
వానాకాలం 2024 విత్తనాల సీజన్ మొదలుకావడం వలన విత్తనాల సేకరణ, అమ్మకాల పై నియంత్రణ కొరకు కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాల మేరకు శనివారం మండలంలోని పలు విత్తన దుకాణాలను మండల తహశీల్దార్ పుష్పలత, ఏఎస్ఐ మోతిరామ్, మండల వ్యవసాయ అధికారి ప్రణీత ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. మండలంలో సుమారు 6500 ఎకరాలలో పత్తి సాగు చేసే అవకాశం ఉందని, దాని కొరకు అవసరమయ్యే పత్తి విత్తనాల పాకెట్స్ విత్తన డీలర్ల దగ్గర అందుబాటులో కలవు. మే 24 నుండి మండలంలోని అన్ని దుకాణాలలో పత్తి ప్యాకెట్లు కొనుగోళ్ళు, అమ్మకాలను నిశితంగా పరిశీలించారు. మండల పరిధిలో వ్యవసాయ అధికారి, గ్రామాల పరిధిలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ప్రత్యక్షంగా తనిఖీ చేస్తున్నారు. ఇప్పటి వరకు మండలంలో 10 మంది డీలర్ల వద్ద 10632 పత్తి ప్యాకెట్లు సమకూర్చుకోగా అందులో 1575 ప్యాకెట్లు రైతులకు అమ్మకాలు జరిగాయి. ఈ తనిఖీల్లో పత్తి విత్తనాల ప్యాకెట్ 864 రూపాయలకే అమ్మాలని, రైతుకు విధిగా రశీదు ను ఇవ్వాలని, లూజ్ వి గానీ, నకిలీ విత్తనాలు గాని అమ్మకూడదని, డీలర్లను విధిగా రోజువారి రైతు వారీగా అమ్మకాల వివరాలు రిజిస్టర్ లో నమోదు చేయాలని డీలర్లను సూచించారు.



## అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రం : గుండేటి

**ఓదెల, ప్రభాత వార్త:**
అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్ పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొలనూర్ రైల్వే గేట్ వద్ద తెలంగాణ అమరవీరులకు కొవ్వొత్తులు వెలిగించి ఉద్యమకారులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఎంతో మంది విద్యార్థులు, అమరుల త్యాగాల ఫలితమే ఈ రాష్ట్రం అని, త్యాగాలు మరువలేనివని, నేడు తెలంగాణ రాష్ట్రం అవతరణ దినోత్సవం సందర్భంగా వారిని స్మరిస్తూ అమరవీరుల ఆత్మబలిదానాలు, ఉద్యమకారుల అనితర త్యాగాల వల్ల రాష్ట్రం వచ్చిందన్నారు. ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఉద్యమకారునికి న్యాయం జరిగే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర రావడం కోసం అమరులైన వారికి కొవ్వొత్తులతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు జనగాం రవి, జంగం కొమురయ్య, మోహన్ రెడ్డి, బండారి చంద్రయ్య, అమల శంకర్, కిరణ్, కొమురయ్య, ఆసరి వెంకటేశం, బండారి సదయ్య, తుంగని అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## మెట్‌పల్లి వార్త

ఇబ్రహీంపట్నం, మల్లాపూర్

## జీవన్‌రెడ్డి గెలుపుకై పూజలు



**మెట్‌పల్లి, ప్రభాతవార్త:**
నిజామాబాద్ మెంబర్‌గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి టి. జీవన్‌రెడ్డి గెలుపుకై మెట్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి నాయకులు జీవన్‌రెడ్డి గెలుపుకై దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి, ముడుపులు కట్టారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేంధర్‌రెడ్డి మాట్లాడుతూ జీవన్‌రెడ్డి ఎంపీగా గెలిస్తే నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చెందుతుందని, మూతబడ్డ షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, నాయకులు ఏనుగు రామానుజన్‌రెడ్డి, జంగస్వామి, జంగిటి రాజేందర్, ప్రతాప్ రెడ్డి, మేడిపల్లి ఎంపీటీసీ నాగేష్, సంతోష్‌రెడ్డి, సత్తయ్య, రేండ్ల రాజ్‌కిరణ్, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సీతారాముల కళ్యాణం



**మల్లాపూర్, ప్రభాతవార్త:**
మల్లాపూర్ మండలంలోని సాతారం గ్రామంలో ఘనంగా సీతారాముల కళ్యాణం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూర్వాంజనేయ స్వామి దేవాలయం వార్షికోత్సవం సందర్భంగా గ్రామాభివృద్ధి, అర్చకులు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో అభిషేకం, హోమం, సీతారాముల కళ్యాణం, రథోత్సవం, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పెద్ద హనుమాన్ జయంతి వేడుకలు

**మల్లాపూర్, ప్రభాతవార్త:**
మండలంలోని రేగుంట గ్రామంలో పెద్ద హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామికి జలాభిషేకం, పంచామృత అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజల కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు గోపి కృష్ణ, గురుస్వామి గనవేని మల్లేష్ యాదవ్, ఎనుగందుల రాములు, దండికే రవి, బొమ్మెన మహేష్, సార్ల జితేందర్, ఇట్టేడి జనార్ధన్, కుందేళ్ళ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



# తూర్పువాడ మున్నూరుకాపు సంఘ అధ్యక్షుడిగా ఆకుల గంగాధర్

**రుద్రంగి, జూన్ 01, ప్రభాతవార్త :**
రుద్రంగి మండల కేంద్రంలోని తూర్పువాడ మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఆకుల గంగాధర్, ఉపాధ్యక్షులుగా బైరెడ్డి కనకయ్య, ప్రధాన కార్యదర్శిగా ఆకుల భూంరెడ్డి, కోశాధికారిగా కోల కిషన్ సభ్యులుగా కోల లచ్చిరెడ్డి, అలువాల నారాయణలను ఎన్నుకోవడం జరిగిందని సంఘ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు ఆకుల గంగాధర్ మాట్లాడుతూ మున్నూరుకాపు సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు ఆకుల గంగారాం, పిప్పరి మోహన్, పుప్పాల భాస్కర్, ఎంగల మల్లేశం, బింగెట్టి వెంకటేష్, ఆకుల గంగాధర్, లోక గణేష్‌తో పాటు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## మంత్రికి ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు

**బోయినిపల్లి, ప్రభాత వార్త:**
అమెరికా పర్యటన దిగ్విజయంగా పూర్తి చేసుకోని హైదరాబాద్ కి తిరిగి విచ్చేసిన రాష్ట్ర రవాణా, బిసి శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు రాజన్న సిరిసిల్ల జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు కూస రవీందర్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగుల వంశీ గౌడ్, తాళ్ళపల్లి తిరుపతి గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు.



# జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

### ఉత్తర్వులు జారి చేసిన కలెక్టర్

**సిరిసిల్ల టౌన్ ప్రభాతవార్త :**
సిరిసిల్ల సమీకృత కార్యాలయంలో జిల్లా పంచాయితి కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తున్న శ్రీశైలం ఉన్నతాధికారుల అనుమతి లేకుండా గైర్హాజరవుతున్నందున కలెక్టర్ అనురాగ్ జయంతి శనివారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారి చేశారు. జిల్లా పంచాయితి కార్యాలయంలో శ్రీశైలం ఉన్నతాధికారులకు ఎలాంటి అనుమతి సమాచారం లేకుండా మార్చి 30 నుండి నేటి వరకు విధులకు హాజరు కావడం లేదన్నారు. నిబంధన ప్రకారం మందాటి శ్రీశైలం పై కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేశారు.

## జిల్లా వ్యాప్తంగా అంగన్వాడి కేంద్రాలు పున: ప్రారంభం

### జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం

**సిరిసిల్ల టౌన్ ప్రభాతవార్త :**
జిల్లాలోని అంన్వాడి కేంద్రాల పున:ప్రారంభం అయ్యాయని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి మాట్లాడుతూ మే 1 నుండి మే 31 వరకు అంగన్వాడి కేంద్రాలలో ఒక పూటబడి నిర్వహిస్తు అయాకు 15 రోజులు టీచరుకు 15 రోజుల చొప్పున సెలవులు ప్రకటించడం జరిగిందని అన్నారు. సెలవులో ఉన్నప్పుడు టీచర్ సెలవులో ఉన్నప్పుడు అయాతో విధులు నిర్వహింప చేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా కుటుంబ సర్వే నిర్వహించడం జరుగుతుందని అన్నారు. దానిలో భాగంగా పెరుగుదల పర్యవేక్షణ కూడా నిర్వహించడం జరుగుతుందని అన్నారు.పాఠశాలల పున:ప్రారంభం సందర్భంగా సెక్టార్ మీటింగ్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బేటి బచావో బేటి పడావోలో భాగంగా ఆడపిల్లలు నిష్పత్తి పెంచడానికి సంస్థగత డెలవరిలు పెంచడానికి త్రైమాసిక పరీక్షలు చేయించుకోవడం గురించి వివరించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ అలేఖ్య, మెడికల్ ఆఫీసర్ దీప్తి సూపర్వైజర్ సుస్మిత రోజా, దేవిక తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**ఏటూర్‌నాగారం, జూన్ 01, ప్రభాతవార్త:**
మండల కేంద్రంలోని ఓడవాడలోగల శ్రీ అభయాంజనేయస్వామివారి ఆలయంలో మరియు క్రాస్ రోడ్డు నందు గల భక్త ఆంజనేయ స్వామివారి ఆలయాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు యల్లా ప్రగడ సూర్యనారాయణశర్మ, శ్రీరామ్ శర్మ, భాను ప్రకాష్ శర్మలు వేకువజాము నుండి స్వామివారికి పంచామృతాభిషేకాలు, తమలపాకు పూజలు, సింధూర పూజలు, మరియు అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయానికి భక్తజనం పోటెత్తి ఆలయ కమిటీవారు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తుల సహకారంతో ఆలయ కమిటీ వారు మహా అన్నదాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, హనుమాన్ భక్తుల, మాలాధారణ స్వాములు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



## ప్రభుత్వ బడుల్లో స్కావెంజర్లను నియమించాలి



**నెల్లికుదురు, జూన్ 1, ప్రభాతవార్త**
ప్రభుత్వ బడుల్లో స్కావెంజర్లను నియమించాలని స్కావెంజర్ల జిల్లా సంఘం అధ్యక్షులు ఇసంపెల్లి సైదులు అన్నారు.శనివారం ఈ మేరకు స్థానిక ఎంపిడిఓ బాలరాజుకు వినతి పత్రం అందచేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....కేంద్రప్రభుత్వం బడుల్లో పారిశుద్యం కొరకు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో బాగంగా 2015లో అతితక్కువ వేతనంతో పాఠశాలల్లో నియమించడని 2020 వరకు ఐదు సంవత్సరాలు పనిచేశామన్నారు.కానీ కరోన సమయంలో లాక్‌డౌన్ పేరుతో తెలంగాణ ప్రభుత్వం పాఠశాలల్లో పనిచేసె స్కావెంజర్లను తొలగించి గ్రామపంచాయతీలకు అప్పగించడం వలన పాఠశాలలో పరిశుభ్రత చేయుటకు ఉండే పనుల వలన చేయలేక పోయామన్నారు.గత ఐదు సంవత్సరాలుగా పాఠశాల నమ్ముకుని పనిచేసిన తమను తొలగించడం వలన తమ కుటుంబాలు వీదినపడ్డామన్నారు.ప్రస్తుతం పాఠశాలలు పున:ప్రారంబమైనందున ప్రభుత్వం విదుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## విత్తన షాపుల్లో టాస్కుఫోర్సు తనిఖీలు



**నెల్లికుదురు, జూన్ 1, ప్రభాతవార్త**
మండల టాస్కుఫోర్సు కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం విత్తన షపాపులలో తనిఖీలు నిర్వహించారు.మండల కేంద్రంలోని మన్‌గ్రోమోర్, ఆగ్రోస్...3లో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కోడిచింతల రాజు, ఎస్సై క్రాంతికుమార్,మండల వ్యసాయ అధికారి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.... షాపుల్లో విత్తనాలను విక్రయించేటప్పుడు రైతులకు రశీదులు ఇవ్వాలని సూచించారు. సంబందిత షాపుల రికార్డులను పరిశీలించి,నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని,నాణ్యమైన విత్తనాలు అందించాలని సూచించారు.

## బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**చిన్నగూడూరు,జూన్1,ప్రభాతవార్త**
మండలంలో ఈ నెల 3నుండి ప్రారంభమయ్యే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఓ రామారావు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరిని బడిలో చేర్పించాలన్నారు. ఇంటింటా తిరుగుతూ విద్యార్థుల వివరాలు నమోదు చేసుకొని బడిలో చేర్పించే విధంగా చైతన్యవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్, రవికుమార్, కిన్నెర యాకయ్య, పాపయ్య, కవిత, మాధవి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.




## ఫర్టిలైజర్ షాపుల్లో పోలీసుల తనిఖీలు



**ఎల్లారెడ్డిపేట, ప్రభాతవార్త.**
ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో గల ఫర్టిలైజర్స్ షాపుల్లో పోలీసులు శనివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం కోసం రాష్ట్రంలోని పోలీసు శాఖకు ఫర్టిలైజర్ షాపులు తనిఖీ చేయాలని ఆదేశించగా, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాలతో ఈ తనిఖీలు నిర్వహించారు. ఎల్లారెడ్డిపేట మండల పోలీసులు గ్రూపులుగా విడిపోయి మండలంలోని ఫర్టిలైజర్స్ షాపుల్లో తనిఖీలు చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే అందజేయాలని, లేకపోతే కఠిన చర్యలుంటాయని యాజమానులను హెచ్చరించారు. రికార్డులను పరిశీలించారు. బొప్పాపూర్, గొల్లపల్లిలోని ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేసిన వారిలో హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, పిసి సాదుర్ల సతీష్ ఉన్నారు.

## ఘనంగా బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర నేత పర్శ హన్మండ్లు జన్మదిన వేడుకలు

### వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రేడ్లు పంపిణీ చేసిన బిసి సంక్షేమ సంఘం నాయకులు



**తంగళ్ళపల్లి, ప్రభాతవార్త:**
తంగళ్ళపల్లి మండల కేంద్రంలో బిసి ఉద్యమ రాష్ట్ర నేత పర్శ హన్మండ్లు జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకొని ఘనంగా నిర్వహించారు. పర్శ హన్మండ్లు జన్మదినం సందర్భంగా పద్మ నగర్‌లోని లగిశెట్టి అనాథ, వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్స్ పాకెట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు కందుకూరి రామగౌడ్ మాట్లాడుతూ ముందు పర్శ హన్మండ్లుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బిసి, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం గత మూడు దశాబ్దాలుగా ఉద్యమిస్తున్న నాయకుడు పర్శ హన్మండ్లు అనేక త్యాగాలు చేశారని, రెండు సార్లు జైలు జీవితం గడిపిన చరిత్ర కూడా ఆయనకే దక్కుతుందని అన్నారు. మంచికి మారు పేరు అని, ఆపదలో ఆదుకునే తత్వమున్న హన్మండ్లన్న ఇటువంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటున్నట్లు వారు తెలిపారు. నాయకులు కందుకూరి రామగౌడ్‌తోపాటు బిక్షపతి, నరేష్, సంతోష్ రాజు తదితరులున్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**నెల్లికుదురు,జూన్ 1, ప్రభాతవార్త**
మండల కేంద్రంతోపాటు మండలంలోని వివిద గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు.కాగ మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలతోపాటు అన్నదాన కార్యక్రమంను నిర్వహించిన అనంతరం గ్రామంలో వాడవాడల హనుమాన్ శోభాయాత్రను అంగరంగ వైభోవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు,గ్రామప్రజలు,హనుమాన్ భక్తులు తదతరులు పాల్గొన్నారు.



# హనుమాన్ జయంతి ఉత్సవాల దృశ్యమాలిక



## హనుమాన్ జయంతి ఉత్సవాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు

**మల్యాల, ప్రభాత వార్త:** కొండగట్టులో జరుగుతున్న పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా వేలాదిగా తరలివచ్చే దీక్షస్వాములు, భక్తులకు అందుబాటులో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు కొండగట్టు పైన దిగువ దొంగలమర్రి చెక్‌పోస్ట్ వైస్ జంక్షన్ వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. అంజన్న ఆలయానికి వందలాది కిలోమీటర్ల నుండి కాలినడకన వచ్చే దీక్ష స్వాములు, భక్తులు, వృద్ధులు వైద్య శిబిరం వద్దకు వెళ్ళి తాత్కాలిక ఉపశమనం కోసం మాత్రలను తీసుకుంటున్నారు. అంతేకాకుండా ఎండ వేడి వల్ల ఎదురయ్యే సమస్యలను కూడా అందిస్తున్నట్లు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి మౌనిక తెలిపారు. జయంతికి వచ్చే భక్తులకు వైద్య శిబిరాలు వైద్యులు అందించిన సలహాలు, మాత్రలు ఎంతో దోహదపడ్డాయి.



## అంజన్నకు పట్టు వస్త్రాలు సమర్పించిన చొప్పదండి ఎమ్మెల్యే



**మల్యాల, ప్రభాత వార్త:** కొండగట్టులో పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలకు శనివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ ఆంజనేయ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకించి తయారు చేయించిన పట్టు వస్త్రాలను ఆలయ ఈవో చంద్రశేఖర్ సమక్షంలో వేది పండితులు, ఆలయ అర్చకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జయంతి ఉత్సవాలకు నిరంతర విద్యుత్ సరఫరా



**మల్యాల, ప్రభాత వార్త:** కొండగట్టు ఆంజనేయ స్వామి వారి ఆలయంలో గత మూడు రోజుల నుండి జరుగుతున్న పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో రంగురంగుల విద్యుత్ దీపాల కాంతులతో పాటు నిరంతర విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలను తీసుకున్నారు. ఈ సందర్భంగా మల్యాల విద్యుత్ సబ్ డివిజన్ పరిధీలోని ఏడి సిహెచ్ బాలలింగం, రామన్నపేట ఏఈ శ్రీనివాస్, కొడిమ్యాల ఏఈ రఘునాథ్, పూడూరు ఏఈ శ్రీనాథ్, మల్యాల ఏఈ దయానందం తో పాటు సబ్ ఇంజనీర్లు, విద్యుత్ సిబ్బంది ఆధ్వర్యంలో కొండగట్టులోనే మకాం వేసి ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

## సింగరేణి ఆర్జీ 2 ఏరియాలో 136శాతం బొగ్గు ఉత్పత్తి

- ఉత్పత్తి వివరాలను వెల్లడించిన జిఎం ఎల్‌వి.సూర్యనారాయణ



**యైటింక్లయిన్‌కాలనీ, ప్రభాతవార్త:** మే నెలలో సింగరేణి ఆర్జీ 2 ఏరియాలో 136శాతం బొగ్గు ఉత్పత్తి జరిగిందని జిఎం ఎల్‌వి.సూర్యనారాయణ తెలిపారు. మే మాసంలో జరిగిన బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, ఓవర్ బర్డెన్ వెలికి తీత, రవాణా వివరాలను జిఎం ఎల్‌వి.సూర్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే మాసంలో ఆర్జీ 2 ఏరియాకు నిర్దేశించి బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలలో 6,29,000 టన్నులకు గాను 8,52,665 టన్నులతో 136శాతం, ఓబి వెలికి తీత 50,34,000 క్యూబిక్ మీటర్లకు గాను 31,78,145 క్యూబిక్ మీటర్లతో 63శాతం ఓబి వెలికి తీయడం జరిగిందని తెలిపారు. అలాగే బొగ్గు రవాణాలో ఆర్జీ 2 ఏరియా నుంచి 8,66,833 టన్నులు రవాణా చేయడం జరిగిందని, మే మాసంలో సింగరేణిలోనే అత్యధిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించి ఆర్జీ 2 ఏరియాను ముందు వరుసలో నిలిపేందుకు కృషి చేసిన ప్రతి ఒక్క ఉద్యోగికి అభినందనలు తెలిపారు. అలాగే రాబోయే రోజుల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని వారు అన్నారు. అలాగే రేపు నిర్వహించు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అన్ని యూనియన్ల నాయకులు, పత్రికా, మీడియా ప్రతినిధులు, పుర ప్రముఖులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిఎం ఎల్‌వి.సూర్యనారాయణ అన్నారు.

# థల్ సైనిక్ గ్రూప్ ఫైరింగ్ పోటీలకు అర్హత సాధించిన పారమిత ఎన్‌సీసీ క్యాండెట్లు

**కరీంనగర్ టౌన్,ప్రభాతవార్త:** కరీంనగర్ నగరంలోని పారమిత ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సిహెచ్.సాయి వీక్షిత్ పటేల్, రావమల్ల త్రివేద్, దుగ్గు సాహిత్ జూన్ నుండి 10వ తేదీ వరకు పదిరోజుల పాటు తెలంగాణ రాష్ట్రంలోని గజ్వేల్‌లో జరగనున్న థల్ సైనిక్ గ్రూప్ ఫైరింగ్ పోటీలకు అర్హత సాధించారని పరమిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఎన్‌సీసీ 99 తెలంగాణ బెటాలియన్ కరీంనగర్ వారి ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించిన బెటాలియన్ పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి యూనిట్‌లోని గజ్వేల్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఇంటర్ గ్రూప్ ఫైరింగ్ పోటీలలో ఎన్‌సిసి 9 తెలంగాణ బెటాలియన్ కరీంనగర్ తరపున ఫైరింగ్ విభాగంలో పారమిత పాఠశాలకు చెందిన 9వ తరగతి చదువుతున్న ముగ్గురు ఎన్‌సీసీ కాడెట్స్ ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కాడెట్‌లను పారమిత పాఠశాల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్




రావు, వినోదరావు, రమణ, యువిఎం ప్రసాద్; హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవిత, 9వ తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ డానియల్ లాట్జమ్, ఎన్‌సీసీ ఆఫీసర్ ప్రశాంత్, ఎక్స్ సర్వీస్ మెన్ రమేష్, సమన్వయ కర్తలు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

# వెలిచాల యువసేన ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

**కరీంనగర్ టౌన్,ప్రభాతవార్త:** హనుమాన్ జయంతిని పురస్కరించుకొని కొండగట్టు అంజన్న ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సేవా సమితి నాయకుడు గుమ్మడి రమేష్ ఆధ్వర్యంలో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని షామియానాలు ఏర్పాటు చేసి భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సేవా సమితి నాయకులు సేవా కార్యక్రమాల్లో ముందుంటుందని, ముఖ్యంగా మండుతున్న ఎండలతో భక్తులు ఇబ్బంది రాజేందర్ రావు ఆదేశాల మేరకు వెలిచాల సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు గుమ్మడి రమేష్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా మాలమహానాడు అధ్యక్షులు తరాల తిరుపతి, సేవా సమితి సభ్యులు, వెలిచాల రాజేందర్ రావు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# వానాకాలం సీజనల్ సమస్యల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి





- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ - రాబోయే వర్షాకాలం సీజన్ సమస్యలపై నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

**పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:** రాబోయే వానాకాలంలో మన జిల్లాలో సీజనల్ సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని సన్నద్ధంగా ఉండాలని ఉండాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్‌ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాబోయే వర్షాకాలం సీజనల్ సమస్యల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ రాబోయే వానాకాలంలో వచ్చే సీజనల్ సమస్యల నియంత్రణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని, రాబోయే విపత్తులను ఎదుర్కొనేందుకు మన పంచాయతీలు, మున్సిపాలిటీలు సన్నద్ధం కావాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో, ప్రతి మున్సిపల్ వార్డులలో ఉన్న నాలాలను అధికారులు పూర్తి పరిశీలించాలని, అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. వానాకాలంలో వచ్చే ఆకస్మిక వరదలను ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలని, లోతట్టు ప్రాంతాలను ప్రజలను తరలించేందుకు పునరావాస కేంద్రాలను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. రాబోయే వానాకాలంలో కురిసే ప్రతి వర్షపు నీటి చుక్కను ఒడిసి పట్టుకునే దిశగా జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అక్రమ మైనింగ్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీచట్టాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో, పట్టణాలలో ఉన్న హోటల్స్, రెస్టారెంట్లను ఆకస్మికంగా తనిఖీ చేయాలని, నాణ్యత ప్రమాణాలు ప్రతి హోటల్లో పాటించే విధంగా పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. రాబోయే వానాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని సన్నద్ధం కావాలని అన్నారు. నిల్వ ఉన్న నీరు తొలగించాలని, ఇంటిలో నీరు నిల్వ ఉంచకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో రెగ్యులర్ ఫాగింగ్ నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, డిఆర్‌డిఓ రవీందర్, ఎంపిడిఓలు, పంచాయతీ రాజ్, సంబంధిత అధికారులు తదితరులున్నారు.

# ఘనంగా హనుమాన్ జన్మోత్సవం

- శ్రీ ఆంజనేయస్వామికి 11,116 కలశాల జలాభిషేకం
- సప్త వర్ణోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహణ

**జగిత్యాల బ్యూరో,ప్రభాతవార్త :** హనుమాన్ జన్మోత్సవం సందర్భంగా 11,116 కలశాల,సప్త వర్ణోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.జగిత్యాల పట్టణంలోని పురానిపేటలోగల శ్రీ లక్ష్మి నరసింహా స్వామి హనుమాన్ సమేత శివ పంచాయతన దేవాలయంలో శనివారం ఆంజనేయ స్వామి వారి జన్మోత్సవంని పురస్కరించుకొని దేవాలయంలో గల మూల విరాట్‌కు బ్రహ్మ ముహూర్తంలో ఉదయం 3 గంటల నుండి 9 గంటల వరకు 11116 కలశాలచే జలాభిషేకం నిర్వహించారు.అలాగే తదుపరి స్వామివారికి సప్త వర్ణాల కలర్స్‌తో అభిషేకం భక్తులచే నిర్వహించారు. తదుపరి స్వామివారికి పుష్పాలతో తమలపాకులతో స్వామివారికి ఇష్టమైన గారెలు జిల్లేడు పువ్వులతో అలంకరించి భక్తులకు దర్శనం ఇచ్చారు.తదుపరి వచ్చిన భక్తులకు కాదంభ ప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమంను విజయవంతం చేశారు.ఈ కార్యక్రమాలు అన్ని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ అరుట్ల పూర్ణచంద్ర చార్యులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ సేవకులు రమేష్, నళిని,



భవాని, శ్రీనివాస్, సాగర్, అద్వైత్, సంతోష్, పరందాములు, గంగాధర్, సురేష్ తదితరులు పాలుగొని హనుమాన్ జన్మోత్సవంని విజయవంతం చేశారు.

# కరీంనగర్ వార్త

## మంత్రి పొన్నంకు యువజన కాంగ్రెస్ నాయకుల ఘనస్వాగతం



**కరీంనగర్ టౌన్,ప్రభాతవార్త:** అమెరికా పర్యటన దిగ్విజయంగా పూర్తి చేసుకొని శనివారం హైదరాబాద్‌కి విచ్చేసిన రాష్ట్ర రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పడాల రాహుల్, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షఫాద్, అనిల్ ముదిరాజ్‌లు స్వాగతం పలికారు.

## రాజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్



**వేములవాడ, ప్రభాతవార్త:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని శనివారం ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ పరమేశ్వరుని చల్లని చూపు ప్రజలందరిపై ఉండి ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. వారి వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, పట్టణ అధ్యక్షుడు సంగ్రగిరి శ్రీనివాస్ గౌడ్, చందుర్తి జడ్పీటీసి నాగం కుమార్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పాత లక్ష్మి, కనికరపు రాకేష్, ధర్మపురి శ్రీనివాస్, సాయి తదితరులున్నారు.

## జంబి హనుమాన్‌ను దర్శించుకున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కుటుంబ సభ్యులు

**జగిత్యాల బ్యూరో,ప్రభాతవార్త :** హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం జంబి హనుమాన్ దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కుటుంబ సభ్యులు వారితో పాటు టిపిసిసి కార్యదర్శి బండ శంకర్ జంబి హనుమాన్ దేవాలయం అధ్యక్షుడు బైరి శ్రీనివాస్ గౌడ్‌తో పాటు వారి కార్యవర్గం, ఈ ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.



## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు - పలు ఫర్టిలైజర్ల దుకాణాల తనిఖీ

**కోనరావుపేట,ప్రభాతవార్త:** నకిలీ విత్తనాలను విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం కోనరావుపేట మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు విక్రయించే విత్తనాలకు తప్పకుండా రశీదులు ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టేందుకు ప్రయత్నించిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పకుండా బిల్లులు తీసుకోవాలని, లైసెన్స్ ఉన్న వ్యాపారి వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తనాల్లో ఏమైనా అనుమానాలు ఉంటే వెంటనే దగ్గరలో ఉన్న పోలీసులకు సమాచారం అందించాలన్నారు. వ్యాపారులు నిబంధనలకు లోబడి క్రయ,విక్రయాలను చేపట్టాలన్నారు. అధిక ధరలకు విక్రయించి, రైతులను మోసాలకు గురిచేస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం రిజిష్టర్‌లు, బిల్లు బుక్‌లతో పాటు విత్తనాలు, ఎరువులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎస్సై అంజనేయులు ఉన్నారు.



# కమలాపూర్ లో తాటి, ఈత వనం దగ్ధం

**కమలాపూర్, ప్రభాత వార్త:**

హన్మకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో తాళ్ళ పంపు మంగళగుట్ట ఏరియాలో తాటి, ఈత వనం పూర్తిగా మంటల్లో కాలిపోయింది. నిత్యం గౌడ కులస్థులు తాటి, ఈత చెట్లను నమ్ముకోని జీవనం కొనసాగిస్తున్న గౌడన్నలు తాము ఉపాధీ కోల్పోయామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పంట పొలాల్లో నిప్పు పెట్టడం ద్వారా అది పెనుగాలులతో ఏర్పడిన మంటలతో దాదాపు 300 తాటి చెట్లు, 100 ఈత చెట్లు పూర్తిగా కాలి బూడిదైన్నాయి. కాలిన తాటి చెట్లలో 200కు పైగా తాటికల్లు పారే చెట్లు ఉండడం వలన గౌడన్నలకు తీరని లోటు కావడంతో వారు వీధిన పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. దాదాపుగా పది లక్షల నష్టం వాటిల్లిందని గౌడ సంఘం అధ్యక్షులు జేరిపోతుల శ్రీనివాస్ తెలిపారు. కావున ప్రభుత్వం దయతలిచి గౌడన్నలకు నష్టపరిహారాన్ని చెల్లించాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్,



జక్కు రవి, రవీందర్, పబ్బు రాజు గౌడ్, పరకాల వీర గౌడ్, బాలసాని చిన్న సాంబయ్య, రవీందర్, మేడిపల్లి రాజు, పెరుమాండ్ల గోపాల్, జక్కు రాజు గౌడ్, లచ్చయ్య, మేడిపల్లి కుమార్, సమ్మయ్య గౌడ్, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవం

**జమ్మికుంట, ప్రభాత వార్త:**

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధీలోని కొత్తపల్లి శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో శనివారం హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు ఆలయ అర్చకులు శేషం వరప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా శ్రీ గణపతి, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి శ్రీ భక్తాంజనేయ స్వామి వారికి పంచామృత అభిషేకం, నాగవల్లి దళం (తమలపాకుల) పూజ, విశేష అలంకరణ, తదుపరి ప్రధాన హారతి తీర్థ ప్రసాదాలు భారీ ఎత్తున తరలివచ్చిన భక్తులకు అందజేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు బొద్దుల రవీందర్, వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి రామమూర్తి దంపతులు స్వామి వార్లకు పట్టు వస్త్రాలను అందజేశారు. జయంతి ఉత్సవాలకు హాజరైనా వందలాది మంది భక్తులకు దాస్యపు వెంకట్రామ నర్సయ్య దంపతులు, గర్రెపల్లి లక్ష్మినారాయణ దంపతులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్ జూగురు సదానందం,



కొత్తపల్లి మాజీ ఉప సర్పంచ్ కొక్కుల శశిధర్, హనుమాన్ దీక్షపరులు కూరపాటి సాయికృష్ణ, జితేందర్, ఉపేందర్, ప్రశాంత్, సతీష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ గా మహమ్మద్ సజ్జద్

**జమ్మికుంట, ప్రభాత వార్త:**

హుజురాబాద్ నియోజకవర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ గా జమ్మికుంట కు చెందిన మహమ్మద్ సజ్జద్ ని నియమిస్తూ శనివారం ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బివి శ్రీనివాస్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ సజ్జద్ మా ట్లాడుతూ.... గత 20 సంవత్సరాల నుండి ఎన్ఎ స్‌యుఐ కార్యకర్తగా, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా, కాంగ్రెస్ పార్టీకి నికార్సైన కార్యకర్తగా పనిచేస్తున్నామని, నా పనిని గుర్తించి నాకు హుజురాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బివి శ్రీనివాస్, స్టేట్ ప్రెసిడెంట్ శివసేనా రెడ్డి, మజీద్ ఖాన్, ఉమ్మడి జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిల్ల శ్రీధర్ బాబు, హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ బాబు, తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇంచార్జులు మేడం సురభి, సయ్యద్ ఖాలిక్ అహ్మద్, యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శులు సంతోష్ గొల్కొండ, శ్రావణ్ రావు, సాగరిక రావు, మమతా రెడ్డి, తెలంగాణ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మాజీద్ ఖాన్, రామడుగు సామ్రాట్, రమాకాంత్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.




# నకిలీ విత్తనాలు అమ్మితే కేసులు తప్పవు

## ఇన్స్పెక్టర్ హరికృష్ణ

**కమలాపూర్, ప్రభాత వార్త:**



నకిలీ విత్తనాలు అమ్మితే కేసులు తప్పవని కమలాపూర్ ఇన్స్పెక్టర్ హరికృష్ణ అన్నారు. మండలంలోని పలు ఫెర్టిలైజర్ షాపులలో వ్యవసాయ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. శనివారం మర్రిపల్లి గూడెం గ్రామంలోని పలు విత్తన దుకాణాల్లోని రికార్డును పరిశీలించారు. వారికి తగు సూచనలు చేశారు. రైతులు తప్పకుండా పత్తి విత్తనాలు కొనే సమయంలో రశీదు తీసుకోవాలని, వ్యాపారులు విత్తన నిల్వ పట్టికను తెలియపరచాలని, విత్తనాలు కొనుగోలు చేసే ప్రతి రైతుకు ఖచ్చితంగా రసీదును ఇవ్వాలని సూచించారు. ఈ తనిఖీలో మర్రిపల్లి గూడెం క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి వినయ్ శర్మ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రమాద సూచికల ఏర్పాటు మున్సిపల్ బాద్యత కాదు

**చొప్పదండి ప్రభాతవార్త:**

చొప్పదండిలో అభివృద్ధి పనుల్లో భాగంగా చెపట్టిన రోడ్డు డివైడర్లకు ప్రమాద సూచికలను ఏర్పాటు చేసే బాద్యత మున్సిపల్ ది కాదని జిల్లా కౌన్సిల్ ఫోరం 6వ వార్డు కౌన్సిలర్ వడ్లూరి గంగరాజు అన్నారు. ప్రమాద సూచికల ఏర్పాటు బాద్యత పనులు చేసే కాంట్రాక్టర్‌దే ఉంటుందని అన్నారు. కొందరు రాజకీయ నాయకులు ఉద్దేశ పూర్వకంగా మున్సిపాలిటిని బదనం చేస్తున్నారని అన్నారు. దీనిని పర్యవేక్షించే బాద్యతకూడా పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంట్‌దేనని అన్నారు. బిజేపి నాయకులు అవగాహాన లేకుండా మాట్లాడడం సరికాదని అన్నారు.

# హుజూరాబాద్ వార్త

## హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్

**వేములవాడ రూరల్, ప్రభాత వార్త:**



వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి గ్రామంలో పెద్ద హనుమాన్ జయంతిని పురస్కరించుకోని శనివారం ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ శ్రీ భక్త ఆంజనేయ స్వామి వారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ భక్త ఆంజనేయ స్వామి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఆ స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని వేడుకున్నారు. హనుమాన్ దేవాలయాలు లేని గ్రామాలు లేవని, ఆ స్వామి వారు గ్రామస్థులకు ఎలాంటి కీడు జరగకుండా భూత, ప్రేమ, పిశాచాలను పారదోలే విధంగా గ్రామానికి ధైర్యాన్ని కల్పిస్తారని అన్నారు. ప్రజలందరికి హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**జమ్మికుంట రూరల్, ప్రభాత వార్త:**



హనుమాన్ జయంతిని పురస్కరించుకోని జమ్మికుంట మండల పరిధీలోని జగ్గయ్యపల్లి గ్రామంలో హనుమాన్ మాలధారణ స్వాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయమే స్వామికి ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం చేసే సమయంలో రాముని భజన, రామ నామ స్మరణతో భక్తులు తన్మయత్వం పొందారు. జయంతి సందర్భంగా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఇరుముడి కట్టుకోని హనుమాన్ మాలధారణ స్వాములు విరమణకు బయలుదేరారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి దాతగా గుజ్జ రాజశేఖర్ రావు సునీత దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దుగ్గినాల రవీందర్, వైస్ చైర్మన్ తిరుపతి రావు, కోశాధికారి రాజు, కమిటి సభ్యులు ప్రభాకర్ రావు, రాజేశ్వర్ రావు, రవీందర్ రావు, మహేందర్, కిరణ్, సంపత్ రావు, రాజశేఖర్, వెంగళరావు, రాజు, రంజీత్ కుమార్, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య వృత్తిని స్వీకరించే వారిని గౌరవించుకోవాలి

## రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్



గోదావరిఖని, ప్రభాతవార్త.

ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడంలో ప్రధాన పాత్ర పోషించే పారిశుద్ధ్య వృత్తిని స్వీకరించే వారిని గౌరవించుకోవలని రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ సిహెచ్. శ్రీకాంత్ అన్నారు. సుదీర్ఘ కాలం రామగుండం నగర పాలక సంస్థ పారిశుద్ధ్య విభాగంలో పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా పని చేసి, పదవీ విరమణ పొందిన పర్శ బతుకమ్మ, రాసకట్ల వెంకటమ్మలకు శనివారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎక్కువ మంది అయిష్టత వ్యక్తం చేసే పారిశుద్ధ్య వృత్తిని స్వీకరించి, పని చేయడం గొప్ప విషయమని అన్నారు. పారిశుద్ధ్య వర్కర్లకు సాధ్యమైనంత త్వరగా పదవీ విరమణ ప్రయోజనాలు అందజేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన పర్శ బతుకమ్మను సన్మానించారు. పదవీ విరమణ పొందిన మరో ఉద్యోగి రాసకట్ల వెంకటమ్మ అనారోగ్య కారణాలతో ఈ కార్యక్రమానికి రాలేకపోవంతో ఆమె కుటుంబ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో వారు చేసిన సేవలను కొనియాడారు. వారి బావి జీవితం బాగుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్ రావు, అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు, సూపరింటెండెంట్ మనోహర్, వర్కర్స్ యూనియన్ నాయకులు యాకయ్య, మురళీధర్ రావు, మంథని లింగయ్య, వేల్పుల రాయమల్లు తదితరులున్నారు.

---

# ఎమ్మెల్యే కూనంనేనికి సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, కుటుంబ సభ్యుల సన్మానం

పెద్దపల్లి, ప్రభాతవార్త.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివ రావు మొదటిసారిగా గోదావరిఖని పర్యటనలో భాగంగా సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం గృహానికి వచ్చారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావుకు సదానందం, విజయ కుటుంబ సభ్యులు వారిని సాధారంగా ఆహ్వానించి, శాలువాతో సత్కరించారు. అనంతరం పెద్దపల్లి జిల్లాలో పార్టీ నిర్మాణం తదితర ప్రజా సంఘాల నిర్మాణానికి సంబంధించి చర్చించారు.



---

# ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన వ్యవసాయ అధికారి అలివేణి



పెద్దపల్లి, ప్రభాతవార్త.

పెద్దపల్లి పట్టణంలోని శాంతినగర్‌లో గల గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని శనివారం ా ఎ ద ్ ఎ ్ ల్లి వ్యవసాయాధికారిని అలివేణి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలోని విత్తన ప్యాకెట్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎఓ అలివేణి మాట్లాడుతూ పెద్దపల్లి మండలంలో విత్తనాల కొరత లేదని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు మంచి విత్తనాలను కొనుగోలు చేయాలని అన్నారు. బోర్డుపై లైసెన్స్ వివరాలు డిస్ప్లే చేసిన దుకాణంలో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని అన్నారు. పత్తి దిగుబడి యాజమాన్య పద్ధతులపై ఆధారపడి ఉంటుందని అన్నారు. నల్లరేగడి భూములలో పత్తి దిగుబడి ఎక్కువగా వస్తుందని తెలిపారు. రసాయన ఎరువులను తగ్గించి, పచ్చి రొట్ట ఎరువులు లేదా జీవన ఎరువులను వాడాలని సూచించారు. పచ్చి రొట్ట ఎరువులు, జీవన ఎరువులు వాడటం వల్ల భూసారం పెరిగిన, పెట్టుబడి తగ్గుతుందని, దిగుబడి పెరుగుతుందని అన్నారు. పచ్చి రొట్ట విత్తనాలు డిసిఎంఎస్ గోదాములు, ఆగ్రోస్ సెంటర్లలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

---

# హనుమాన్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

పెద్దపల్లి, ప్రభాతవార్త.

పెద్దపల్లి మండలంలోని పెద్ద కల్వల గ్రామంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈపూజల్లో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఆలయాల కమిటీ సభ్యులు, భక్తులు తదితరులున్నారు.



---

# ఘనంగా సీనియర్ జర్నలిస్టుల జన్మదిన వేడుకలు



పెద్దపల్లి, ప్రభాతవార్త.

పెద్దపల్లి జిల్లాకు చెందిన ఇద్దరు జర్నలిస్టుల జన్మదిన వేడుకలు శనివారం జిల్లా కేంద్రంలోని ప్రజాదర్బార్ తెలుగు దినపత్రిక ప్రాంతీయ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నమస్తే తెలంగాణ స్టాఫ్ రిపోర్టర్ అంకరి ప్రకాష్, సూర్య దినపత్రిక రిపోర్టర్ సాబీర్ పాషా ఇరువురి జన్మదినం ఒక్కటే రోజున కావడం పట్ల పలువురు జర్నలిస్టులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేయించి, శాలువాతో వారిని సన్మానించారు. ఇలాంటి వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, జర్నలిజంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షను వెల్లిబుచ్చారు. ఈ వేడుకల్లో సీనియర్ జర్నలిస్టులు ఎర్రోజు వేణుగోపాల్, బెజ్జంకి నరేష్, పులిపాక రామకృష్ణ, పోగుల విజయ్‌కమార్, నాగిశెట్టి శ్రీనివాస్, గుడ్ల శ్రీనివాస్, కుమార్, తూర్పాటి శ్రీనివాస్, ప్రభాకర్, శఖీల్ పాల్గొన్నారు.

# లోకపేట ఇన్చార్జి కార్యదర్శి జాడ చెప్పరా

ఎలిగేడు,ప్రభాతవార్త :

గ్రామాల్లో ప్రజలకు ఏ సమస్య వచ్చినా పంచాయతీ కార్యదర్శి కి సమాచారం ఇస్తే సమస్యలు పరిష్కారం అవుతాయనే ప్రజల నమ్మకాన్ని ఇన్చార్జి పంచాయతీ కార్యదర్శి వమ్ము చేస్తున్నాడని ఎలిగేడు మండలం లేకపేట గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ముప్పిరితోట కార్యదర్శికి అదనపు బాధ్యతలు అప్పజెప్పిన అప్పటినుండి గ్రామానికి వచ్చిన దాఖలాలు లేవని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసిన విద్యుత్ దీపాలు వెలగకపోయినా,త్రాగునీళ్లు రాకపోయినా,కార్యదర్శి పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సమస్యలు ఉన్నాయని ప్రజలు ఫోన్ నెంబర్ తెలుసుకొని ఫోన్ చేసిన స్పందించడం లేదన్నారు. గ్రామంలో సమస్యలు తాండవిస్తున్న అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవో వై.భాస్కరరావును వివరణ కోరగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

---

పెద్దపల్లి వార్త
పెద్దపల్లి, ఎలిగేడు, ధర్మారం, సుల్తానాబాద్, ఓదెల, కొత్తపల్లి, కొలనూర్, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్, గోదావరిఖని, అనంతారం, పాలకుర్తి, యైటింక్లైన్ కాలనీ

# హనుమాన్ జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే



సుల్తానాబాద్, ప్రభాతవార్త.

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని స్థానిక పెరిక గిద్దె, శాస్త్రినగర్‌లోని అభయాంజనేయ స్వామి, మండలంలోని సుద్దాల గ్రామాల్లో హనుమాన్ జయంతిలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ భక్తులందరికీ ఎమ్మెల్యే జయంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మిరాజమల్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మినుపాల ప్రకాష్ రావు, సాయిరి పద్మ మహేందర్, శ్రీగిరి శ్రీనివాస్, మేర్గు వెంకటేష్, రమణ, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# హనుమాన్ దేవాయలంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మనాలీ దంపతులు ప్రత్యేక పూజలు



గోదావరిఖని, ప్రభాతవార్త.

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గోదావరిఖని మార్కండేయకాలనీలోని హనుమాన్ దేవాలయంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆయన సతీమణి మనాలీ ఠాకూర్ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామగుండం నియోజక వర్గ ప్రజలకు సేవ చేసే శక్తిని ఇవ్వాలని, నియోజక వర్గ ప్రజలను చల్లంగా చూడాలని వేడుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో ఆమెను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

# సేవా కార్యక్రమాల్లో శ్రీదేవి నాయక్

రుద్రంపూర్, జూన్ 1 – ప్రభాతవార్త:

కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు శ్రీదేవినాయక్ సేవా కార్యక్రమాల్లో ముందుంటున్నారు. పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తికి తన సొంత ఖర్చులతో వీల్‌చైర్‌ను అందించి ధాతృత్వాన్ని చాటుకున్నారు. చుంచుపల్లి మండలం ధన్బాద్ పంచాయతీకి చెందిన గట్టు బాబురావుకు పక్షపాతం రావడంతో నడవలేని స్థితిలో ఇబ్బందులు పడుతున్నారు. భార్య ఈశ్వరమ్మ అన్ని తానై ఎంతో కష్టపడి భర్త యోగక్షేమాలు చూసుకుంటోంది. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు జేమ్స్ సునీల్ ఆదేశానుసారం శ్రీదేవినాయక్ శుక్రవారం రాత్రి ఈ వీల్‌చైర్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో జేమ్స్ సునీల్, బైపల్లి శంకర్, బైపల్లి సూరి, పొట్టి శ్రీరాములు, ప్రేంకుమార్, కీర్తి కుమార్, నాగేష్, నందన్, కీర్తి రవీందర్‌లు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కవ్వంపల్లిని విమర్శిస్తే ఖబర్దార్

## మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు కొండ్ర సురేష్




**మానకొండూర్, ప్రభాతవార్త :**

మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను బిఆర్ఎస్ నాయకులు విమర్శిస్తే ఊరుకునేది లేదని, ఖబర్దార్ అంటూ బిఆర్ఎస్ నాయకులకు మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు కొండ్ర సురేష్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు కొండ్ర సురేష్ మాట్లాడుతూ మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను విమర్శించే స్థాయి మండల బిఆర్ఎస్ నాయకులు కనుకుంట్ల అభిలాష్, అడప శ్రీనివాస్‌కు లేదన్నారు. మానకొండూర్ చెరువుకట్ట అభివృద్ధి పేరుతో కోట్లాది రూపాయలను బిఆర్ఎస్ నాయకులు దండుకున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్ పాలనలో మానకొండూర్ మండలంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను వందరోజుల్లో నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మచ్చలేని నాయకుడన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బిఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి, కాంగ్రెస్ నేతలపై బిఆర్ఎస్ నాయకులు మరోసారి విమర్శిస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ యూత్ నాయకులు ఘాటుగా సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ యూత్ నాయకులు బుర్ర శ్రీకాంత్‌గౌడ్, మాతంగి సహదేవ్, నల్లల శ్రీనివాస్, కనుకుంట్ల అజయ్, కనకం రాజేష్, నాగరాజు, బుర్ర అజిత్, కార్తీక్, సుభాష్, మనోహర్, తిరుపతి, వాసాల సాయిచరణ్, రుద్రవరం అశోక్, తదితరులు పాల్గొన్నారు.




## వడదెబ్బతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

**మానకొండూర్, ప్రభాతవార్త :**



మండల పరిధిలోని వెల్ది గ్రామానికి చెందిన కోసనం దిలీప్‌కుమార్(31)అనే ట్రాక్టర్ డ్రైవర్ వడదెబ్బంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు శనివారం తెలిపారు. వెల్ది గ్రామానికి చెందిన కొసనం ఈశ్వరమ్మ కనుకయ్య కుమారుడు కొసనం దిలీప్ అనే యువకుడు కరీంనగర్ పట్టణంలోని ఓసిమెంట్ కంపెనీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. ప్రతిరోజు లాగానే పని నిమిత్తం శుక్రవారం కరీంనగర్‌కు వెళ్లాడు. తీవ్రమైన ఎండలో పనిచేయడంతో ఎండ దెబ్బకు గురైన దిలీప్‌కుమార్ అస్వస్థకు గురయ్యాడు. తెల్లవారుజామున వడదెబ్బతో మృతిచెందినట్లు తెలిపారు. ఒక్కగానొక్క కొడుకు దిలీప్ వడదెబ్బతో మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు చూసిన పలువురు కంటతడి పెట్టారు. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## వేతనాలు చెల్లించాలని పారిశుద్ధ్య కార్మికుల వినతి

**గంభీరావుపేట, ప్రభాతవార్త:**



నాల్గు నెలలుగా రావల్సిన వేతనాలు చెల్లించాలని కోరుతూ గంభీరావుపేట మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది శనివారం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. రెక్కాడితే కాని డొక్కాడని పారిశుద్ధ్య కార్మికులకు రావల్సిన వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ కష్టతరమవుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. జీతాలు చెల్లింకపోవడంతో పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందని తక్షణం స్పందించి వేతనాలు చెల్లించాలని పారిశుద్ధ్య సిబ్బంది పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. జీతాలు చెల్లించపోవడంతో పని మానేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని కార్మికులు ఈ సందర్భంగా వెల్లడించారు. విధుల్లో చేరకపోతే సస్పెండ్ చేస్తామని అధికారులు బెదిరిస్తున్నారని కార్మికులు వాపోయారు. కార్మికుల జీతాలు చెల్లించిన తక్షణం విధులలో చేరుతామని కార్మికులు పంచాయతీ కార్యదర్శి ఎదుట కరాఖండిగా తేల్చిచెప్పారు. వినతిపత్రం సమర్పించిన వారిలో పారిశుద్ధ్య కార్మికులు బరిగెల భిక్షపతి, టేకుమల్ల రవి, ఎర్రోళ్ల సకులవ్వ, ఎల్లంగారి లక్ష్మి, గాదం ఇందిరా, ఇరిగి లక్ష్మి, బండ సత్యం, భూదయ్య, శనిగరపు నర్సయ్య, బూదవ్వ, దురేష్, ఎల్లవ్వలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## గంభీరావుపేటలో ఫర్టిలైజర్ షాప్‌ల తనిఖీ

**గంభీరావుపేట, ప్రభాతవార్త:**



గంభీరావుపేట మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాప్‌లను ఎస్సై రామ్మోహన్, మండల వ్యవసాయ ఏఈవో అనుషలతో కలిసి శనివారం తనిఖీ చేశారు. షాప్‌లలోని రికార్డులు క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించారు. వ్యవసాయానికి సంబంధించిన మందులను తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు విక్రయించిన పక్షంలో కేసులు నమోదు చేయడంతో పాటు యజమానులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీలలో పోలీస్, వ్యవసాయ శాఖ సిబ్బందిపాల్గొన్నారు.

## హనుమాన్ ఆలయంలో భజన మండలి సత్సంగ్

**చొప్పదండి ప్రభాతవార్త:**



చొప్పదండి పట్టణంలోని తపాల కార్యాలయం వద్ద గల హనుమాన్ దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా షిర్డి సాయి భజనమండలి ఆద్వర్యంలో భజన మండలి సత్సంగ్‌ను నిర్వహించారు. ఆంజనేయ స్వామి జయంతి పూజ భజన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షిర్డి సాయి భజనమండలి సభ్యులు దండె రాజయ్య, పిట్టల రఘు, దండె లింగయ్య, చీకట్ల లచ్చయ్య, దూస రాము, పూదరిలస్మయ్య, నారాయణ, రాములు, మంచికట్ల విఠల్, దండె కొమురయ్య, కొక్కుల మునిందర్, ప్రణీత్, కొత్తపల్లి శ్రీనివాస్, చిలుకునూరి లక్ష్మిరాజం, దూస లక్ష్మినర్సయ్య, పిట్టల లచ్చన్న, గర్శకుర్తి కనుకయ్య, ఆలయ నిర్వహణ కమిటి సభ్యులు కటుకం భూమయ్య, రేపాల అంజయ్య, నలుమాచు కాశీనాథం, ఆడేపు ప్రకాశం, రేపాల మునిందర్, తొడుపునూరి లక్ష్మయ్య, బొల్లం సాంబమూర్తి, ఆలయ అర్చకులు జనగామసత్యనారాయణ, జనగామ రఘువులు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య నిర్మూలనకు తక్షణ చర్యలు చేపట్టాలి

### పంచాయతీ కార్యదర్శికి గ్రామస్థులు వినతి



**గంభీరావుపేట, ప్రభాతవార్త:** గంభీరావుపేట మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో పేరుక పోయిన పారిశుద్ధ్య నిర్మూలనకు తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు శనివారం పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం సమర్పించారు. ప్రధాన రహదారి వెంబడి పారిశుద్ధ్యం పేరుకపోయి దారి వెళ్లే ప్రజలు నడువలేని పరిస్థితిలో ఉన్నారని ఇలాగే పారిశుద్ధ్యం పేరుకపోతే వ్యాధులు ప్రభలే ప్రమాధముందని గ్రామ పురోహితులు రాచర్ల పార్థసారధిశర్మ పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్‌కు వివరించారు. పారిశుద్ధ్య కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలు చెల్లించాలని కోరారు. త్వరలో జరిగే పంచాయతీ ఎన్నికలలో పోటీ చేసే సర్పంచ్ మరియు వార్డులకు పోటి చేసే అభ్యర్థులు నాతో పాటు చెత్తను తోలగించడంలో పాలుపంచుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో గ్రామస్థులు లక్ష్మిపురం మల్లిఖార్జున్‌గౌడ్, తుమ్మనపల్లి రాజేష్, మనోజ్‌కుమార్, వెన్ను బాలశంకర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## బెస్ట్ బ్యాట్‌మెన్‌గా కట్టెకోల అభిరాం

**చొప్పదండి ప్రభాతవార్త:**



మండల పరిదిలోని ఆర్నకొండ గ్రామానికి చెంది కట్టెకోల అన్నపూర్ణ శ్రీనివాస్‌ల దంపతుల కుమారుడు కట్టెకోల అభిరాం బెస్ట్ బ్యాట్‌మెన్‌గా ఆవార్డును అందుకున్నారు. ఈ మేరకు హైద్రాబాద్‌లోని రెడ్డి హీల్స్, ప్రైమరీ లీగ్ అండర్ 19 సంవత్సరాల విభాగంలో ఆయన పాల్గోని బ్యాటింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ నేపథ్యంలో ఆయనను బెస్ట్ బ్యాట్‌మెన్‌గా ఎంపిక చేసి నిర్వహకులు ప్రత్యేకంగా అభినందించారు. ఆభిరాంకు చిన్నప్పటి నుండి క్రికెట్ అంటే ఎక్కువ ఇష్టం ఉండేది. తల్లిదండ్రుల ప్రోత్సహంతో తాను క్రీడారంగంలో రాణిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కోచ్ మహ్మద్ అక్రం రెడ్‌హిల్స్ కార్పోరేటర్ తదితరులు కట్టెకోల అభిరాంను ప్రత్యేకంగా అభినందించారు.

## వృద్ధులకు పండ్లు బ్రెడుల పంపిణి

**గంభీరావుపేట, ప్రభాతవార్త:** రాష్ట్ర బీసీ ఉద్యమ నాయకులు పర్శ హన్మాండ్లు జన్మదినం పురస్కరించుకుని గంభీరావుపేట మండల కేంద్రంలోని మా అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శనివారం పండ్లు, బ్రెడ్‌లు పంపిణి చేశారు. ముందుగా బీసీ సంఘం నాయకులు హన్మాండ్లు జన్మదినం పురస్కరించుకుని కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, బ్రెడ్‌లు అందచేశారు. అనగారిన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తున్న హన్మాండ్లు మునుముందు మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకొని బీసీ హక్కుల సాధనకు పోరాడాలని పలువురు ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు బట్టు ప్రవీణ్, నరేష్‌చారి, ఎలుక రాజు, కడారి మహేష్, పెరిమెల్లి రమేష్, సురేష్ రాజులతో పాటు పలువురు పాల్గొన్నారు.



## సాయిబాబా ఆలయ కమిటీ నూతన కార్యవర్గం



చందుర్తి, ప్రభాతవార్త.

చందుర్తి శ్రీ సాయిబాబా ఆలయ కమిటీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా పొంచెట్టి తిరుపతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ తిరుపతి మాట్లాడుతూ సాయిబాబా ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొట్టె ప్రభాకర్, పులి సత్యం, దారం చంద్రం, కత్తి తిరుపతి, గంగాధర్, డిష్ రవి తదితరులున్నారు.




## పదవీ విరమణ పొందిన రోడ్లు భవనాల అధికారికి కలెక్టర్ ఘన సన్మానం

రిటైర్మెంట్ రోజే పెన్షన్ మంజూరు పత్రాలు అందించిన కలెక్టర్

రోడ్లు, భవనాల శాఖ కార్యనిర్వహణ ఇంజనీర్ సిహెచ్.రాములు, కలెక్టరేట్ దఫేదార్ జి.మల్లేశం పదవీ విరమణ కార్యక్రమం



పెద్దపల్లి, ప్రభాతవార్త.

శుక్రవారం రిటైర్మెంట్ పొందిన సమీకృత జిల్లా కలెక్టర్ దఫేదారుకు పెన్షన్ మంజూరు పత్రాలను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అందించారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పదవీ విరమణ పొందిన రోడ్లు, భవనాల శాఖ కార్యనిర్వహణ ఇంజనీర్ సిహెచ్.రాములు, కలెక్టరేట్ దఫేదారు జి.మల్లేశంలకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జె.అరుణశ్రీ, జివి.శ్యాంప్రసాద్ లాల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ రోడ్లు, భవనాల శాఖ కార్యనిర్వహణ ఇంజనీర్‌గా సిహెచ్.రాములు అందించిన సేవలు ప్రశంసనీయమని అన్నారు. రెవెన్యూ శాఖలో దఫేదారుగా మల్లేశం తన విధులను కట్టుదిట్టంగా నిర్వహించారని, కొత్తగా వచ్చే అధికారులకు క్షేత్రస్థాయిలో పరిస్థితులను క్లుప్తంగా వివరిస్తూ అధికారుల విధి నిర్వహణలో తమ సహకారం అందించారని కలెక్టర్ తెలిపారు. మనం ఉద్యోగంలో చేరినప్పుడే మన పదవీ విరమణ తేదీ నిర్ణయించబడుతుందని, ఇన్ని సంవత్సరాల పాటు ప్రభుత్వానికి, ప్రజలకు అందించే సేవలను గుర్తించి సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించుకునేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సిబ్బంది కలెక్టర్ అభినందనలు తెలిపారు. అదనపు కలెక్టర్ జివి.శ్యాంప్రసాద్ లాల్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన సిబ్బంది సిహెచ్.రాములు, మల్లేశంతో తనకు 25 సంవత్సరాల పరిచయం ఉందని, మల్లేశం మొదటి నుంచి చాలా నిజాయితీతో, దర్పంతో పని చేశారని, దఫేదారుగా అతను పని చేసిన ప్రతి అధికారి వద్ద సిన్సియర్‌గా పని చేశాడని, కార్యాలయంలో జరిగే అంశాలను బయటకు రానియకుండా గోప్యత పాటించేవాడని అదనపు కలెక్టర్ తెలిపారు. రోడ్లు, భవనాల శాఖ కార్యనిర్వహణ ఇంజనీర్‌గా సిహెచ్.రాములు తన విధులను కట్టుదిట్టంగా నిర్వహించి, విజయవంతంగా ఎటువంటి రిమార్కులు లేకుండా పదవీ కాలం పూర్తి చేశారని అన్నారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ పదవీ విరమణ పొందిన వారిని ఉద్దేశించి మాట్లాడారు. పదవీ విరమణ పొందిన ఆర్అండ్‌బి కార్యనిర్వహణ ఇంజనీర్ సిహెచ్.రాములు మాట్లాడుతూ రోడ్లు భవనాల శాఖలో కలెక్టర్ గైడెన్స్‌తో ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేసేందుకు తనవంతు కృషి చేయడం జరిగిందని అన్నారు. తహశీల్దార్ నుంచి కలెక్టర్ వరకు వివిధ స్థాయి అధికారుల వద్ద విధులు నిర్వహించడం జరిగిందని, నలుగురు సిఎంల వద్ద కూడా డిప్యూటేషన్‌లో విధులు నిర్వహించడం జరిగిందని అన్నారు. అనంతరం రెవెన్యూ శాఖలో పదవీ విరమణ పొందుతున్న దఫేదారుకు, జిల్లా కలెక్టర్ పెన్షన్ మంజూరు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రేఎడ్డి, జిల్లా రవాణా శాఖ అధికారి పి.రంగారావు, జిల్లా మత్స్య శాఖ అధికారి, డిఆర్‌డిఓ రవీందర్, సిపిఓ రవీందర్, పదవీ విరమణ పొందుతున్న సిబ్బంది కుటుంబ సభ్యులు తదితరులున్నారు.

## భక్తాంజనేయ స్వామిని దర్శించుకున్న ప్రభుత్వ విప్



వేములవాడ, ప్రభాతవార్త.

పెద్ద హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని వేములవాడ పట్టణంలోని ఉప్పు గడ్డ వీధిలో గల భక్తాంజనేయ స్వామి ఆలయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, పట్టణ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, సాగరం వెంకటస్వామి, కౌన్సెలర్ ఇప్పపుల అజయ్, నాయకులు చిలుక రమేష్, కూరగాయల కొమురయ్య, కనికరపు రాకేష్, దైత్తా కుమార్, సగ్గు పద్మ, వస్తాదు కృష్ణ, కూర దేవయ్య, కోయల్ కార్ మస్తాన్ తదితరులున్నారు.

## తిమ్మాపూర్‌లో ఆకట్టుకున్న రామాయణం



చందుర్తి, ప్రభాతవార్త.

చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామంలో చిరుతల రామాయణం నాటిక ప్రదర్శన ఆకట్టుకుంది. రెండు రోజుల పాటు గ్రామంలో చిరుతల రామాయణ కార్యక్రమాన్ని ప్రదర్శించారు. మరుగున పడుతున్న కలలను కాపాడుటకు ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కళాకారులు తెలిపారు. రావణ బ్రహ్మ పాత్రదారుడు రావణ బ్రహ్మగా, సీతా అపహరణ సమయంలో జంగమదారిగా ఆర్టీసీ ఉద్యోగి సావనపల్లి శ్రీనివాస్ (కళారత్న అవార్డు గ్రహిత) నటించిన పాత్ర చూపరులను ఆకట్టుకుంది.

## ఖాళీగా గ్రామపంచాయతీ ఖాతాలు

గ్రామాల అభివృద్ధి నిర్వహణకు ఇబ్బందులు

అప్పుల ఊబిలో పడుతున్న పంచాయతీ కార్యదర్శులు

సంతకాలకే పరిమితమైన గ్రామ ప్రత్యేక అధికారులు




ఎలిగేడు,ప్రభాతవార్త :

గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం ముగిసి నాలుగు నెలలు గడిచి ఫిబ్రవరి 01 నుండి ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించిన గ్రామ పంచాయతీల పాలనపై ప్రత్యేక అధికారులకు అవగాహన లేక పంచాయతీల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. నిధుల విషయంలో ప్రస్తుత లేకపోవడంతో గ్రామాల్లో గ్రామపాలన పడకేసింది దానికి తోడు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామపంచాయతీ కార్యదర్శులకు పనిభారంతో పాటు ఆర్థిక భారం ఇబ్బందికరంగా మారింది. గ్రామపంచాయతీ ఖాతాల్లో డబ్బులు లేకపోవడంతో గ్రామాల్లో కనీస వసతుల కోసం గ్రామపంచాయతీ కార్యదర్శులు అప్పులు చేసి ప్రజల అవసరాలు తీర్చే పరిస్థితి ఉందని కార్యదర్శులు వాపోతున్నారు. గ్రామాల్లో బోర్ల మరమ్మత్తులు ట్రాక్టర్ల డీజిల్‌కి గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో కార్మికుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని మేమే అప్పులు తెచ్చి వారికి జీతాలు చెల్లిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక అధికారులకు గ్రామాల్లో ఉండే సమస్యలపై అవగాహన లేకపోవడం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించకపోవడంతో గ్రామాల్లో ఏ చిన్న సమస్య వచ్చినా ప్రజలు కార్యదర్శులకే చెప్పడంతో వారు సమస్యలను పరిష్కరించేందుకు నానా తంటలు పడవలసి వస్తుంది. పనిభారంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక అధికారులు చేతులెత్తేయడంతో కార్యదర్శి అప్పులు చేసి ప్రజల సమస్యలు తీర్చుతున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడుపై అధికారుల వేధింపులు నిధుల లేమితో ఉద్యోగం చేయడం కష్టంగా మారిందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేయాలని కోరుచున్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



చందుర్తి, ప్రభాతవార్త.

చందుర్తి మండలంలోని మల్యాల గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం పెద్ద హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి వారికి రుద్రాభిషేకం, అర్చన, స్వామి వారి అలంకరణ ఆలయ అర్చకులు కందాలై వెంకట రమణ చారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో స్వామివారికి రుద్రాభిషేకం, అర్చన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని అన్నారు. ప్రతి సంవత్సరం ఆలయంలో అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు, గ్రామ ప్రజలు, మహిళలు తెల్లవారుజామునే ఆలయంలో పూజలలో పాల్గొనడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు ఉన్నారు.

## నిర్లక్ష్యంలో అధికారుల తీరు

వృధాగా పోతున్నా మిషన్ భగిరధ నీరు

నిరుపయోగంగా మంచి నీటి బోరు

ప్రభాతవార్త కన్నాయిగూడెం

బుట్టాయిగూడెం గ్రామ పంచాయితి పరిధిలో మిషన్‌భగిరధ వాటర్ ట్యాంక్ పైపుల వద్ద లీకేజి ఉండటం వల్ల మిషన్ భగిరధ నీరు కొన్ని నెలల నుండి వృధాగా పోతుంది.సంబందిత గ్రామ పంచాయితి.మిషన్ భగిరధ అధికారులకు తెలిపినా కూడ పట్టించుకోవడంలేదు. వాటర్ ట్యాంక్ చుట్టు పక్కల గల గృహలకు మిషన్ భగిరధ నల్లా కనెక్షన్ పెట్టకపోవడం వలన చుట్టుప్రక్కల గృహల ప్రజలు పైపు లీకుల వద్ద నుండి ప్లాస్టిక్ పైపు ద్వారా తమ ఇండ్లలోకి త్రాగునీరును పట్టుకుంటున్నారు. తర్వాత త్రాగు నీరు



విచ్చలవిడిగా వృధాగా పోతుంది.నీరు వృధాగా పోవటం వలన వాటర్ ట్యాంక్ చుట్టు ప్రక్కల పెద్ద గోయ్యిల మారి బురద మయంగా మారింది.ఇదిలా ఉంటె వాటర్ ట్యాంక్ పక్కనె మంచి నీటి బోర్ పంపు మరమత్తుకు నోచుకోకుండా వృధా ఉంది. ఆ పంపును మరమత్తు చేయించాలని అక్కడి ప్రజలు అంటున్నారు.ఇప్పటికైన సంబదిత అధికారులు స్పందించి ప్రజల సమస్యను పరిష్కరించి, త్రాగునీటిని వృధాగా పోకుండ మరమత్తుపనులు చేపట్టాలి.

## పోచన్నపేటలో భూవివాదంపై డీసీపీ విచారణ



ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :

జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని పోచన్నపేట గ్రామంలో సర్వేనంబర్ 422, 423లలో ఏ.26-00మేరకు ఎస్సీలకు చెందిన వారసత్వపు భూవివాదంపై డీసీపీ పీ.సీతారాం శనివారం క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. ఈసందర్భంగా శ్రీపతి లక్ష్మీభర్త మల్లయ్య ఫిర్యాదు చేయగా ఇందులో ఎస్సీల వద్ద నుంచి ఏ.6-00మేరకు బి.సత్యనారాయణ కొనుగోలు చేశారు. ఇందులో భూ విక్రయదారులు, పొజిషన్‌లో ఉన్న 20మంది రైతులు విచారణకు హాజరయ్యారు. జరిగిన భూవివాదంపై ఇంతకుముందు అమ్ముకున్న క్రయవిక్రయాలపై క్షేత్రస్థాయిలో పొజిషన్‌లో ఉన్నవారిని చుట్టుపక్కల రైతులను ఒక్కొక్కరిని పిలుచుకుని జరిగిన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఈసమస్యను మూడురోజుల్లో పరిష్కరింపచేస్తామని, అంతవరకు ఎవరి పొజిషన్ వివాదాలకు దారితీయకుండా ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ కె.సతీష్‌కుమార్, పోలీసు సిబ్బంది జమాలోద్దీన్, అనిల్‌కుమార్, రైతులు శ్రీతి నారాయణ, శ్రీపతి ప్రభాకర్, శ్రీపతి నరసింహులు, మల్లయ్య, రమేష్, జంజాల యాదయ్య, శ్రీపతి సౌందర్య, రేణుక, జంజాల వెంకటయ్య,శ్రీపతి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేకపూజలు





జనగామ టౌన్, జూన్ 1 ప్రభాతవార్త :

జనగామ జిల్లాకేంద్రంలోని హనుమాన్ దేవాలయాలలో హనుమజ్జయంతి సందర్భంగా హనుమాన్‌స్వామికి భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా జనగామ పట్టణంలోని ఉప్పలమ్మ దేవాలయంలోని హనుమాన్‌స్వామికి ఆలయ అర్చకులు వారణాసి పవన్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేకంగా పూలతో అలంకరించి స్వామివారికి చందనమువేసి వడమాల, మామిడిపండ్లతో మాల, పలురకాల పూలతో మాలలతోపాటు తమలపాకులమాలలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు హనుమాన్‌స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అదేవిధంగా గుండ్లగడ్డలోని శ్రీ ఉమామహేశ్వర గుడిలో హనుమాన్ జయంతి సందర్భంగా అయ్యగారు రాజేష్‌భార్గవ్ ఆధ్వర్యంలో హనుమంతుడికి ప్రత్యేకపూజలు నిర్వహించగా అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈసందర్భంగా హనుమంతుడికి మల్లెపూలు, తమలపాకులు, ఎర్రగన్నేరు, కనకాంబరాలు, చామంతిలు, సింధూరంతో అభిషేకంచేసి ఆంజనేయసహస్రనామార్చనలతో పాటు అత్యంత ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించారు. అలాగే స్వామివారికి పూలు, పండ్లు కొబ్బరికాయలు సమర్పించారు. భక్తులు తమలపాకులపై 121సార్లు జైశ్రీరామ్ జైజై శ్రీసీతారామ్ అని రాసి హనుమంతుడికి మాలగా వేశారు. భక్తులు హనుమాన్‌చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో పాటించారు. కార్యక్రమంలో శ్రీను, శ్రీకాంత్, వినయ్, పవన్, అరుణ్ పాల్గొన్నారు.

## పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న ప్రైవేటు పాఠశాలలు

జనగామ టౌన్, జూన్ 1 ప్రభాతవార్త :

జనగామ జిల్లాకేంద్రంలోని ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పేరుతో విచ్చలవిడిగా విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారని ఏబీవీపీ ఆధ్వర్యంలో డీఈఓ కె.రామును కలిసి వినతిపత్రం అందచేసినట్లు ఏబీవీపీ జనగామ జిల్లా కన్వీనర్ తోట హృతిక్‌సాయి తెలిపారు. ఈసందర్భంగా హృతిక్‌సాయి మాట్లాడుతూ జనగామలో ప్రైవేటు పాఠశాలలు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్‌ను వారి పాఠశాలల్లోనే తీసుకోవాలంటూ విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తూ వారి తల్లిదండ్రులనుంచి విచ్చలవిడిగా దోపిడీకి ఎగబడ్డారని ఆరోపించారు. గవర్నమెంట్ నామ్స్‌కు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతున్నటువంటి పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, అలాగే వాటి గుర్తింపు రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. కాగా, ఈ విషయమై డీఈవో స్పందించి అన్ని పాఠశాలలకు నోటీసు పంపిస్తానని తెలిపారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కారనయవర్గ సభ్యులు గుంటుపల్లి కార్తిక్, చిలేవరు హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు



రఘునాథపల్లి, జూన్ 1 ప్రభాతవార్త :

హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని కంచనపల్లి గ్రామంలో శనివారం హనుమాన్ దీక్ష భక్తులు ప్రజలు పెద్దఎత్తున హనుమాన్ గుడివద్ద ప్రత్యేకపూజలు ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. హనుమాన్ భక్తులు ఇరుముడి కట్టుకొని కొండగట్టుకు వెళ్లారు. మరికొంతమంది జై హనుమాన్ జైజై హనుమాన్ అంటూ గ్రామంలో వాడవాడలో తిరిగారు. ఈసందర్భంగా ప్రజలకు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి ఉపేందర్‌శర్మ నేపథ్యంలో స్వాములు నాగులగోని నాగేశ్వరరావు, సూర్యప్రకాష్, కమిటీ గౌరవ అధ్యక్షులు కిషన్‌రావు, ప్రముక డాక్టర్ రంగోజు ఈశ్వరయ్య, ప్రదీప్‌కుమార్, మహేందర్, ఐలయ్య, మేకల శ్రీను, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితునికి ఆర్థికసాయం అందచేసిన ఫోటోగ్రాఫర్స్



పాలకుర్తి, జూన్ 1 ప్రభాతవార్త :

పాలకుర్తి మండలం చెన్నూరు గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ ఎలిగేటి సోమన్న బైక్ ప్రమాదంలో గాయపడగా పరామర్శించిన మండల ఫోటోగ్రాఫర్లు రూ.10వేలు ఆర్థికసాయంను అందచేశారు. ఈకార్యక్రమంలో జీడీ సంజయ్, బొమ్మగాని ప్రదీప్‌కుమార్, రాపోలు రామ్‌లక్ష్మణ్, గజ్జిరాజు, గుడికందుల నరేష్, శ్రీకాంత్, మహేష్, మొగుల ప్రదీప్, శేఖర్, మధుబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మత్స్య, వెదురు సహకారసంఘాల ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల

జనగామ టౌన్, జూన్ 1 ప్రభాతవార్త :

జనగామ జిల్లాలోని సహకార సంఘాల ఎన్నికల కోసం ప్రతిపాదనలు రాష్ట్ర సహకార సంఘాల ఎన్నికల అథారిటీకి సమర్పించాలని జనగామ జిల్లా సహకార అధికారి వై.రాజేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 8 మత్స్య సహకార సంఘాలకు, ఒక వెదురు పారిశ్రామిక సహకార సంఘాలకు ఎన్నికలను తెలంగాణ రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ఈనెల 3నుంచి 25వరకు నిర్వహిస్తుందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల కాలపరిమితి ముగియబోయే ఇతర సహకార సంఘాలు వారియొక్క సంబంధిత ఫంక్షనల్ రిజిస్టర్లు, వారి సంఘాల ప్రతిపాదనలు తెలంగాణ రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ, హైదరాబాద్ వారికి సమర్పించాలని పేర్కొన్నారు.

## ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్‌పురస్కార్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ టౌన్, జూన్ 1 ప్రభాతవార్త :

ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్‌పురస్కార్ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమాధికారి జె.జయంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 05నుంచి 18ఏళ్ల లోపు బాలబాలికలు వివిధ రంగాలలో సాహసం, ధైర్యసాహసాలు, క్రీడలు, సామాజిక సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, కళలు అండ్ సంస్కృతి తదితర అంశాలలో ప్రతిభ కనబర్చిన బాలబాలికలు 2024సంవత్సరానికి గాను ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలపురస్కారాలను భారత ప్రభుత్వం ప్రధానం చేయనున్నట్లు జిల్లా మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమాధికారి జె.జయంతి తెలియచేశారు. ఈ దరఖాస్తులను ఆన్‌లైన్ వెబ్‌సైట్‌నందు జూలై 31, 2024తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు. అంతేగాకుండా మరిన్ని వివరాలకు జిల్లాకేంద్రంలోని సూర్యాపేట రోడ్డులోగల కలెక్టరేట్ జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, జిల్లాబాలల పరిరక్షణ విభాగం, బాలరక్షా భవన్, గ్రౌండ్‌ఫ్లోర్ నంబర్ జి6లో సంప్రదించాలని తెలిపారు.




## బిట్టుపల్లి చెరువులో మట్టి తవ్వకాలకు తాత్కాలిక అనుమతుల

మంథని – ప్రభాతవార్త

మంథని మండలం బిట్టుపల్లి చెరువులో మట్టి తవ్వకాలకు తాత్కాలిక అనుమతులను కలెక్టర్ ఆదేశాల మేరకు నీటిపారుదలశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం సాయంత్రం నుండి సోమవారం వరకు చెరువులో మట్టి తవ్వకాలకు అనుమతి ఇచ్చినట్టు నీటిపారుదల శాఖ ఈఈ తెలిపారు. చెరువులో కేవలం 4,365 క్యూబిక్ మీటర్లు మాత్రమే మట్టి తవ్వకాలు జరిపేందుకు అధికారులు అనుమతులు ఇచ్చారు.

## మంథనిలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



మంథని – ప్రభాతవార్త

హనుమాన్ జయంతిని పురస్కరించుకుని శనివారం మంథనిలోని పలు హనుమాన్ దేవాలయాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అన్ని హనుమాన్ దేవాలయాలను అందంగా ముస్తాబు చేశారు. అదేవిధంగా విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామాయణంలోని సుందరాకాండ గురించి వివరించిన గాదె లావణ్యాను అయోధ్య నుండి వచ్చిన శ్రీరామ కండువాతో పాటు భగవద్గీత అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్తు నాయకులు మేడగోని రాజమౌళిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసోమేశ్వర ఆలయంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

పాలకుర్తి, జూన్ 1 ప్రభాతవార్త :

పాలకుర్తి మండలకేంద్రంలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం హనుమాన్‌జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్షేత్రపాలకుడు అయినటువంటి శ్రీభక్తాంజనేయస్వామి వారికి హనుమాన్ జయంతి ఉత్సవంలో భాగంగా విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, మూల విరాట్‌కి పంచామృత చందన అభిషేకములు, స్వామివారికి తమలపాకులు, పుష్పాలంకరణ, వడమాలతో అష్టోత్తర అర్చన అదేవిధంగా ఉత్సవ మూర్తికి విశేష అభిషేకములు, మన్యుసూక్త విధాన మూలమంత్ర హవనము, పూర్ణాహుతి నీరాజన మంత్ర పుష్పములు తీర్థప్రసాద వితరణ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈవో భాగం లక్ష్మీప్రసన్న, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



# నూతన చట్టాలపై పోలీసు అధికారులు, సిబ్బందికి శిక్షణ, అవగాహన తప్పనిసరి

**-జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే**

**-జులై 1 నుండి అమలు కానున్న నూతన చట్టాలు...**

**-విడతల వారీగా జిల్లా పోలీసులు అందరికి శిక్షణ అందజేత...**

**-సిబ్బంది నూతన చట్టాలను నేర్చుకోవాలనే తపన కలిగి ఉండాలి...**

**-శిక్షణ కార్యక్రమంలో పాల్గొని సిబ్బందికి సూచనలు చేసిన ఎస్పీ**

ప్రభాతవార్త ప్రతినిధి - జయశంకర్ భూపాలపల్లి



జులై 1, 2024 నుడి దేశవ్యాప్తంగా నూతన చట్టాలను అమలు కానున్న సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసులకు అవగాహన కార్యక్రమాలను, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా పోలీసులు అందరికి విడతల వారీగా నూతన చట్టాలపై శిక్షణను అందిస్తున్నట్లు తెలియజేశారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని సూచనలు చేయడం జరిగింది. దేశంలో న్యాయ వ్యవస్థలోని చట్టాలను మార్చేందుకు తీసుకొనున్న చర్యలలో భాగంగా కొత్తగా రూపొందించిన నూతన మూడు చట్టాలు -భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్షా అధినియం-2023 ఈ మూడు చట్టాలు రానున్న జులై 1, 2024 నుండి అమలులోకి రానున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...ముఖ్యంగా నూతన చట్టాల నందు మారిన సెక్షన్స్ మరియు చాప్టర్లను ప్రతి ఒక్కరికి క్షుణ్ణంగా వివరించి తెలియజేయాలని సూచించారు. మారిన చట్టాలను అనుగుణంగా కేసులను నమోదు చేసే విధంగా పూర్తిగా సంసిద్ధమై ఉండాలని అన్నారు. నూతన చట్టాలు అమలు జరిగిన వెంటనే ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పూర్తిగా ప్రతి ఒక్క పోలీసు అధికారికి, సిబ్బందికి అవగాహన ఉంటేనే రానున్న రోజుల్లో బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎలా స్వీకరించాలి, ఏఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలి, స్టేషన్ బెయిల్ కు ఎవరు అర్హులు, చార్జీషీట్ ఎలా తయారు చేయాలి, నిందితులకు శిక్షలు ఖరారు చేయడంలో దర్యాప్తు అధికారులు ఎలా వ్యవహరించాలనే తదితర అంశాలపై కొత్త చట్టంలో మార్పులు, చేర్పులు చేశారని అన్నారు. భారత న్యాయ వ్యవస్థ ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నదనీ, అవసరాన్ని బట్టి ప్రజా భద్రత కోసం ఎన్నో చట్టాల రూపకల్పన జరిగిందన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్దతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించేందుకు వీలు దొరుకుతుందని, ఎస్పి అన్నారు. ప్రతి ఒక్కరూ నూతన అంశాలను నేర్చుకోవాలని ఎస్పి కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి నారాయణ నాయక్, డిసిఆర్‌బి, ఎస్‌బి ఇన్స్పెక్టర్లు, రామకృష్ణవసంత్ కుమార్, భూపాలపల్లి సిఐ నరేష్ కుమార్, రిజర్వు ఇన్స్పెక్టర్లు రత్నం, కిరణ్, శ్రీకాంత్ జిల్లా పరిధిలోని ఎస్ఐలు, కోర్టు డ్యూటీ అధికారులు, స్టేషన్ రైటర్లు తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా వేసవి దుక్కులు



**-పొలం పనుల్లో రైతన్న బిజీబిజీ**

**-పొలాలు శుభ్రం చేయటం**

**-లోతు దుక్కులు దున్నకాలు ప్రారంభం**

పరకాల-ప్రభాతవార్త



ఈ ఏడాది వానాకాలం పంటలకు అనుకూలంగా ముందస్తు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలియజేస్తుండడంతో రైతులు వ్యవసాయ పొలాలను దుక్కిదున్ని చదును చేసుకుంటున్నారు.15 రోజుల కిందట డివిజన్ వ్యాపంగా మోస్తరు నుంచి భారీగా కురిసిన వర్షాలు సైతం రైతన్నలకు కలిసి వచ్చాయి.ఆయా గ్రామాల్లో రైతులు తమ అనుకూలతను బట్టి ఎడ్లుల నాగలి,ట్రాక్టర్ల సహాయంతో పొలాలను దుక్కిదున్ని సాగుకు సిద్ధం చేస్తున్నారు.వారం రోజుల్లో వచ్చే మృగశిర(మిరుగు) కార్తె వానకాలం సాగుకు అనుకూలం కావడంతో అన్ని గ్రామాల్లో దుక్కిదున్నే పనిలో రైతులు బిజీబిజీ అయ్యారు.ప్రస్తుతం సీజన్‌లో సైతం ఆశించిన పంటలు పండించి వ్యవసాయాన్ని లాభసాటిగా మలుచుకునేందుకు రైతులు కోటి ఆశలతో దేవుడిపై భారం వేసి పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.వ్యవసాయ శాస్త్రవేత్తలు, మండలస్థాయి అధికారుల సూచనలను పాటిస్తూ వానాకాలంలో లాభ సాటి పంటలను సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.రైతులు ఇప్పటికే పలుమార్లు వేసవి దుక్కులను పూర్తి చేసుకోని వానకాలం పంట సాగుకు రెడీ అయ్యారు.ఈ క్రమంలో వ్యవసాయాధికారులు సైతం వేసవి దుక్కులు లాభాలను రైతులకు వివరిస్తున్నారు.గ్రామాల్లో రైతులకు నకిలీ విత్తనాలపై వివరిస్తూ వారిపట్ల అదికారులు కఠినంగా వ్యవహరిస్తూ దాడులు నిర్వహిస్తున్నారు.నకిలీ విత్తనాలు,పురుగుల మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.ఈ క్రమంలోనే ఆయా గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు,పోలీసులు సంయుక్తంగా అవగాహన సదస్సులు నిర్వహించి నకిలీ విత్తనాలు,ఎరువులు,పురుగు మందుల వాడకం వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరిస్తున్నారు.

**లోతు దుక్కులు వల్ల ఎన్నో ప్రయోజనాలు...**

వేసవి కాలంలో లోతు దుక్కులు చేయడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని రైతులు, అధికారులు అంటున్నారు.లోతు దుక్కి వల్ల భూమి నీటిని పీల్చుకోవడంతో,భూమిలో నీటి శాతం విలువ ఎక్కువగా ఉంటుంది. దీంతోపాటు భూమి పొరల తెగి అందులో దాగిఉన్న చీడ పీడలు బయటికి వచ్చి ఎండ వేడిమికి చనిపోయి,పురుగులను పక్షులకు మేతగా మారుతాయి. లోతు దుక్కి వల్ల కింద ఉన్న మట్టిపైకి వచ్చి,పూన ఉన్న మట్టి కింద పోవడంతో భూమి సాంద్రత పెరిగే అవకాశం ఉంది.అందుకే ప్రతి ఏటా పంట పూర్తి అయిన తర్వాత వేసవికాలంలో లోతు దుక్కులు దున్నా లని రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

**పొలాలు శుభ్రం చేయటం...**

గత సీజన్‌లో సాగు చేసిన పంట పొలాల్లో పంట విశేషాలు తొలగించడం,ఎ౹ాలాలను శుభ్రం చేసి ఎప్పుడు వర్షం పడితే అప్పుడు దుక్కులు దున్నుకోవడానికి సిద్ధం చేసుకుంటున్నారు.జూన్ మొదటి వారంలో వర్షాలు పడితే పత్తిపంట సాగు చేయడం కోసం వారం నుండి రైతులు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు.ఈ విధంగా వ్యవసాయ పనులు మండ లంలో ముమ్మరంగా సాగుతున్నాయి.

## నకిలీ పత్తివిత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు

రఘునాథపల్లి, ప్రభాతవార్త :

ఫర్టిలైజర్‌షాపు యజమానులు ఎవరైనా రైతులకు నకిలీ పత్తివిత్తనాలు అమ్మినా అలాంటి సాపు యజమానులపై పీడీయాక్టు నమోదు చేస్తామని అధి కారులు హెచ్చరించారు. శనివారం మండలకేంద్రంలోగల ఎనిమిది ఫర్టిలైజర్ దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ బృందం ఆకస్మికంగా తనిఖీ నిర్వ హించారు. తనిఖీల్లో భాగంగా పత్తి విత్తన ప్యాకెట్లు, ఫర్టిలైజర్‌షాపు లైసెన్స్, స్టాక్ రిజిస్టర్, రైతు రిజిస్టర్, ఇన్వాయిస్, బిల్‌బుక్స్, సోర్స్ సర్టిఫి కెట్‌లను అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనాలు, ఎరువుల విక్రయాలకు సంబంధించిన రశీదును రైతులు విధిగా అడిగి తీసు కోవాలన్నారు. పంట చివరి వరకు రైతులు పత్తివిత్తనాలకు సంబంధించిన రశీదుతోపాటు విత్తన ప్యాకెట్‌ను సైతం భద్రపర్చుకోవాలని సూచించారు. రైతులు లూజ్ పత్తివిత్తనాలు జోలికి వెళ్లవద్దని అధికారులు తెలిపారు. ఫర్టిలైజర్ షాపు యజమానులు ఎరువులుగానీ విత్తనాలు గానీ ఎమ్మార్పీ ధరలకు మించి అమ్మరాదని అధికారులు ఆదేశించారు. ఫర్టిలైజర్ షాపు యజమానులు పత్తివిత్తనాలు బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టినా అలాంటి వారిపై క్రిమినల్ చర్యలు తప్పవని అధి. కారులు ఆదేశించారు. ప్రతీ ఒక్క ఎరువుల షాపు ముందు స్టాక్‌బోర్డును కని పించేలా పెట్టాలని అధికారులు తెలిపారు. తనిఖీల్లో తహసీల్దార్ పురం యుగంధర్, ఎస్ఐ డి.నరేష్, మండల వ్యవసాయాధికారి కె.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



## జిల్లాలో విచ్చల విడిగా గుట్కా అమ్మకాలు

**-అధిక ధరలతో సొమ్ముచేసుకుంటున్న వ్యాపారస్తులు**

**గుట్కాలు తినడం వల్ల కాన్సర్ వస్తుంది....**

**-ఒక్కో పాకెట్ మీద అధనంగా రూ.50నుండి 100పైగా అమ్మకం**

**-చోద్యం చూస్తున్న జిల్లా అధికారులు**

మహబూబాబాద్, ప్రభాతవార్త




ఇటీవల ప్రభుత్వ నిషేదించిన గుట్కా, పాన్‌బార్, అంబర్‌ల దందా జిల్లాలో జోరుగా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. వీటిని కొందరు మహారాష్ట్ర నుండి తెప్పించి మరికొందరు హైద్రాబాద్ అడ్డాగా చేసుకొని అక్కడి నుండి వివిధ జిల్లాలకు చేరవేస్తున్నారు. మహబూబాబాద్‌కు చెందిన ముగ్గురు,నలుగురు బడా వ్యాపారస్తులు పాకెట్‌లను సరఫరా చేస్తున్నట్లు సమాచారం. అయితే వీరు జిల్లాలోని ఇతర మండలాలకు సప్లై చేస్తున్నారు. ప్రభుత్వ నిషేదాన్ని ఆసరాగా చేసుకున్న వ్యాపారస్తులు ఒక్కో పాకెట్‌పై అధనంగా రూ.50నుండి 100కు పైగా విక్రయిస్తూ సొమ్ము చేసు కుంటున్నారు. అదేంటని ప్రశ్నించగా మా దగ్గర దొరకదు మీరు ఎక్కడైనా కొనుక్కొండని దురుసుగా జవాబు ఇస్తున్నారు. మేము కూడా ఇవ్వాల్సిన వారికి ఎంతో కొంత ముట్ట చెప్పాలి కదా అంటూ దాట వేస్తున్నారు. ప్రజలు ఆరోగ్యానికి ఇవి ఎంతో హనికరం అని ప్రభుత్వం గుర్తించి వాటిని నిషేదిస్తే వ్యాపారులు మాత్రం వాటిని యదేచ్ఛగా విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెల గాటాలు ఆడుతున్నారు. గతంలో కూడా కొన్ని రోజులు నిషేధాజ్ఞలు విధించగా ఆ సమయంలో వ్యాపా రులు లక్షల రూపాయలు వెనకేసు కున్నట్లు సమాచారం. ఇప్పుడు కూడా అదేరీతిలో వ్యవహరిస్తూ ఇతర రాష్ట్రాల నుండి పాకెట్‌లను తెప్పించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మున్సిపాలిటి కేంద్రంలో నెహ్రూసెంటర్‌ను అడ్డాగా చేసుకొని హోల్‌సేల్ కిరాణ దుకాణాల్లో వీటిని విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. గత కొన్ని రోజుల నుండి అధికారులు ఇలాంటి అక్రమ వ్యాపారాలు చేస్తే పిడియాక్టు నమోదు చేస్తామని హెచ్చరించినా వ్యాపారస్తులు మాత్రం అదేబాటలో నడు స్తున్నారు. అంతేగాకుండా ప్రతి కిరాణం, పాన్‌షాపుల్లో కూడా ఇవి అందు బాటులో ఉంటున్నాయి. సంబం దిత అధికారులు విచారణ చేపట్టి బాధ్యు లపై కఠిన చర్యలు తీసుకొని ప్రజల ప్రాణాలను రక్షించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.




## హనుమాన్ జయంతి సందర్భంగా పలు ఆలయాలను దర్శించుకున్న వినయ్‌భాస్కర్

ప్రభాతవార్త-సుబేదారి:



శనివారం రోజు హనుమాన్ జయంతి సందర్భంగా టిఆర్ఎస్ మాజీ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ పలు హనుమాన్ ఆలయాలను దర్శించు కున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లక్ష్మీగణపతి దేవాలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు

ప్రభాతవార్త- సుబేదారి:



హను మకొండ సుబేదా రిలోని ఎక్సైజ్ కాలనీలో శ్రీలక్ష్మి గణపతి దేవస్థానంలో హను మాన్ జయంతి సంద ర్భంగా విశేష అభిషేకము, చందన పూజ, ఆకుపూ, విశేష అలం కరణ తమలపాకుల పూజలు నిర్వహించి హనుమాన్ చాలీసా పారాణాన్ని పటించి సాయంత్రం పల్లకి ఊరేగింపు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అశేష భక్తజనం పాల్గొని భక్తి శ్రద్ధలతో పల్లకి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులతోపాటు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ హాళ్లను స్ట్రాంగ్ రూంలను తనిఖీ చేసిన కలెక్టర్



**మంథని - ప్రభాతవార్త:** మంథని డివిజన్‌లోని రామగిరి మండలంలోని జెఎన్‌టియు కళాశాలలో ఏర్పాటు చేసిన లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ హాళ్లను స్ట్రాంగ్ రూంలను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రం వద్ద బారికేడ్లను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఎన్నికల ఏజెంట్లు ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది ప్రత్యేక ఎంట్రెన్స్ ఉండేవిధంగా చూడాలన్నారు. అదేవిధంగా పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కొరకు చేసిన ఏర్పాట్లను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎన్నికల కేంద్రం నుండి పాసులు ఉన్నవారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రం లోపలికి అనుమతించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జె. అరుణశ్రీ, జివి శ్యామ్‌ప్రసాద్ లాల్, సహాయ రిటర్నింగ్ అధికారులు తాహసీల్దార్లు పాల్గొన్నారు.

## పత్తివిత్తనాలు బ్లాక్ చేస్తే కఠిన చర్యలు

**- జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి**



**మంథని - ప్రభాతవార్త:** ఫర్టిలైజర్ దుకాణయజమానులు పత్తివిత్తనాలు ఒకే రకమైనవి బ్లాక్ చేసే వారిపైన కఠిన చర్యలు ఉంటాయని జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి అన్నారు. శనివారం మంథని పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. డీలర్లు ఒకే బ్రాండ్ కు సంబంధించిన విత్తనాలు బ్లాక్ చేస్తే వారిపైన చట్టపరంగా చర్యలు ఉంటాయని ఎట్టి పరిస్థితుల్లో ఎంఆర్‌పి ధరకంటే ఎక్కువ విక్రయించ కూడదన్నారు. రైతులకు సరిపడే విధంగా పత్తివిత్తనాలు ఉన్నాయని ఇంకా అమ్మకాలు ప్రారంభం కాలేదని రైతులు ఒకే బ్రాండ్‌వెంట పడకూడదన్నారు. అన్ని బిజి-2 హైబ్రిడ్ ఒకే దిగుబడి ఇస్తాయని పంటల యాజమాన్యం సక్రమంగా పాటించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన దుకాణాల్లో స్టాక్‌ను స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు.

## రాబోయే వానాకాలం పంట సీజన్‌కు సమృద్ధిగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయి

**- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ - విత్తనాలు లభ్యతపై రైతులకు సందేహాలు ఉంటే 9573951060కు ఫోన్ చేయాలి -విత్తనాల స్టాక్‌పై ఉన్న అపోహలను తొలగిస్తూ మీడియా సమావేశం**



**పెద్దపల్లి, ప్రభాతవార్త:** రాబోయే వానాకాలం పంట సీజన్‌కు మన జిల్లాలో సమృద్ధిగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అన్ని రకాల పంటలకు సంబంధించి విత్తనాల స్టాక్ డీలర్ల వద్ద ఉందని, రైతులు అనవసరపు ఆందోళనలు చెందవద్దని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వానాకాలం విత్తనాల లభ్యతను వివరిస్తూ రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మన జిల్లాలో రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, వచ్చే వానాకాలం పంటకు ఎక్కడా విత్తనాల కొరత రాకుండా పటిష్ట చర్యలు చేపట్టామని అన్నారు. జిల్లాలో ఉన్న 353 విత్తన డీలర్ల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు సరఫరా చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఉన్న లక్షా 55వేల 496 మంది రైతులకు 2లక్షల 77వేల 720 ఎకరాల సాగు భూమి ఉందని, వీటిలో 2లక్షల 8వేల ఎకరాలలో వరి పంట, 60 వేల ఎకరాలలో పత్తి పంట, 12వేల ఎకరాలలో కూరగాయలు, పండ్లు, ఇతర పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. అవసరానికి మించి 50శాతం అదనంగా విత్తనాల స్టాక్ ఉందని తెలిపారు. నకిలీ విత్తనాల విక్రయాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బిజి 3 పత్తి విత్తనాలను ప్రభుత్వం నిషేధించిందని తెలిపారు. రైతులు లైసెన్స్‌డ్ డీలర్ల వద్ద నుంచి రశీదు పొంది విత్తనాలను కొనుగోలు చేయాలని అన్నారు. విత్తనాల లభ్యతపై రైతులకు సందేహాలు ఉంటే కాల్ సెంటర్ 9573951060కు ఫోన్ చేయాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న రామగుండం సిపి మాట్లాడుతూ కల్తీ విత్తనాలను అరికట్టేందుకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, రైతులు ప్రభుత్వం గుర్తించిన సర్టిఫైడ్ డీలర్ల వద్ద నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, విడిగా ఎక్కడ విత్తనాలు కొనుగోలు చేయవద్దని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, సంబంధిత అధికారులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## సింగరేణి సిఅండ్ఎండి బలరాంకు ఐఐఐఈ పెర్ఫార్మెన్స్ ఎక్సలెన్స్ అవార్డు

**- సింగరేణి సంస్థ కూడా అత్యుత్తమ పని తీరు అవార్డు బహూకరణ**

**గోదావరిఖని, ప్రభాతవార్త:** సింగరేణి సంస్థ సిఅండ్ఎండి ఎన్.బలరాంకు జాతీయ స్థాయి ట్రిపుల్‌ఐఇ (ఇండియన్ ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్) సంస్థ వారు ప్రతిష్టాత్మక పెర్ఫార్మెన్స్ ఎక్సలెన్స్ అవార్డు 2024ను ప్రకటించారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ముస్సోరిలో శుక్రవారం రాత్రి జరిగిన 24వ జాతీయ స్థాయి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల సమావేశంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. సంస్థ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం తరువున డైరెక్టర్ ఆపరేషన్స్, పర్సనల్ ఎన్‌వికె.శ్రీనివాస్ ఈ అవార్డును స్వీకరించారు. సిఅండ్ఎండి చూపిన చొరవతో 2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ చరిత్రలోనే అత్యధికంగా 700లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని, బొగ్గురవాణాను సాధించి, సరికొత్త రికార్డు నెలకొల్పింది. అంతేగాకుండా 35,700 కోట్ల రూపాయల టర్నోవర్ సాధించడం జరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన ఉత్పత్తి కన్న అధికంగా సాధిస్తూ సరికొత్త రికార్డులు సృష్టించడంతో జాతీయ స్థాయిలో సింగరేణికి మంచి పేరు వచ్చింది. ఈ నేపథ్యంలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ వారు ఆయనకు వ్యక్తిగతంగా పెర్ఫార్మెన్స్ ఎక్సలెన్స్ అవార్డు 2024ను బహూకరించడం జరిగింది. అలాగే కంపెనీ విభాగంలో అద్భుతమైన పని తీరును కనబరిచిన కంపెనీగా సింగరేణికి పెర్ఫార్మెన్స్ ఎక్సలెంట్ అవార్డును నిర్వాహకులు బహూకరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ నుంచి జిఎం ఎంఎన్ టి.సురేష్‌బాబు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఎన్.భాస్కర, డిజిఎం ఐఈ సిహెచ్. సీతారాంబాబు, ట్రిపుల్ ఐఈ గౌరవ కార్యదర్శి ఏవివి ప్రసాద్ రాజు పాల్గొన్నారు.




## బీఆర్ఎస్ పాలనలో అమరుల ఆకాంక్షలు నెరవేరలేదు

**- అప్పుల తెలంగాణగా మారింది - ఓటమితో బతికిన కెసిఆర్**

**- విలేకరుల సమావేశంలో కూనంనేని సాంబశివరావు**



**గోదావరిఖని, ప్రభాతవార్త:** తెలంగాణ స్వరాష్ట్రంలో రాష్ట్రంకోసం అమరులైన వారి ఆకాంక్షలు నెరవేరలేదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర నాయకులు కూనంనేని సాంబశివరావు అన్నారు. గోదావరిఖనిలో ఎఐటియుసి కేంద్ర కమిటీ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన శనివారం ఇల్లందు క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం కోసం దాదాపు 12 వందల మంది విద్యార్థులు, యువకులు ప్రాణ త్యాగాలు చేస్తే, వారి ఆశయాలకు అనుకూలంగా ఈ పది సంవత్సరాల పరిపాలనలో కెసిఆర్ నిర్వహించలేక పోయారని ఆయన నిశితంగా విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఒకప్పుడు ధనిక రాష్ట్రంగా ఉండేదని, పది సంవత్సరాల కాలంలో కెసిఆర్ లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి అప్పుల తెలంగాణ రాష్ట్రంగా మార్చారని ఆయన అన్నారు. కెసిఆర్ హయాంలో ఏ ఒక్క శాఖ కూడా సంతృప్తికరంగా లేరని అన్నారు. అంతా అవినీతి, ఆరోపణలతో నిండిపోయిందని, వాటిని ఉచ్చారించడానికి కూడా మనస్సు అంగీకరించడం లేదని కూనంనేని వాపోయారు. కెసిఆర్ నాయకత్వంలో జరిగిన పది సంవత్సరాల కాలంలో నిర్మించిన ప్రాజెక్ట్‌లపై న్యాయమూర్తి చే విచారణ జరిపించి, బిఆర్ఎస్ పార్టీపై ఉన్న అవినీతిని కడిగేయాలని అన్నారు. లక్షల కోట్ల అవినీతి చేయమని వందల సంఖ్యలో విద్యార్థి యువకులు ఆత్మ త్యాగాలు చేశారా అని ఆయన బిఆర్ఎస్ నాయకత్వాన్ని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్, విద్యుత్ శాఖ, వ్యవసాయ రంగంలో ఇలా విద్యా, వైద్యం ప్రతి శాఖలో అవినీతిమయంగా తయారైందని ఆయన తెలిపారు. అలాగే బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కాలరాసిందని, కనిపించకుండా నియంతృత్వ పాలన కొనసాగించిందని, ధనిక రాష్ట్రమంటూ అప్పుల కుప్ప చేసిందని, అందుకే ప్రజలు ఎన్నికల్లో ఓడిస్తూ తీర్పు ఇచ్చారని అన్నారు. ఇప్పటికైనా ఆ పార్టీ బుద్ధి తెచ్చుకొని నిర్మాణాత్మకంగా ప్రజలకు దగ్గరై పని చేయాలని సూచించారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు చేయవద్దని, తెలంగాణ అభివృద్ధి ఆకాంక్షలు నెరవేర్చాలని అన్నారు. తిరిగి పునర్నిర్మాణం చేసుకోవాలని అన్నారు. గత పాలనలో అన్ని సంస్థలను ఆర్థికంగా కష్ట చేశారని, విద్యుత్, ఇరిగేషన్‌తోపాటు సింగరేణిని కూడా నాశనం చేశారని అన్నారున. ఇప్పుడు కొత్త ప్రభుత్వం దగ్గర డబ్బు లేదని, ఐనా సర్దుబాటు చేస్తున్నారని అన్నారు. సింగరేణిలో గత సిఅండ్ఎండి శ్రీధర్ వేల కోట్ల దోపిడీ చేశారని, అందులో పాలకులను కూడా భాగస్వాములను చెశ్రాదని, ఈ కుంభ కోణంపై న్యాయమూర్తితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇరిగేషన్ పేరున మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలపై విచారణ జరిపించాలని ఆయన అన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ బూర్జువా పార్టీలేనని, కాంగ్రెస్‌తో కలిసి పని చేసినంత మాత్రాన ప్రజా సమస్యలపై పోరాడాతనే ఉంటామని అన్నారు. రాష్ట్రంలో, దేశంలో బిజెపి అత్యంత ప్రమాదకారి అని, అందువల్లే కాంగ్రెస్‌తో కలిసి పని చేస్తున్నామని, రాష్ట్రంలో బిఆర్ఎస్ కూడా ఉండాలని కోరుకుంటున్నామని అన్నారు. మోదీ ఎన్నికల్లో ముస్లిం వ్యతిరేక విద్వేశం రెచ్చగొట్టి హిందూ పేరు మీద గెలవాలని ప్రచారం చేశాడని అన్నారు. కాంగ్రెస్ గెలిచిన చోట సిపిఐ బలమున్నదని, భవిష్యత్‌లో 25 నుంచి 30 స్థానాల్లో పార్టీ బలోపేతంపై దృష్టి పెడుతున్నామని అన్నారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్షులు వి.సీతారామయ్య, జిల్లా సిపిఐ కార్యదర్శి తాండ్ర సదానందం, నాయకులు ఎల్.ప్రకాష్, వైవి.రావు, మడ్డి ఎల్లయ్య, కె.స్వామి, రంగు శ్రీనివాస్, ఆరెల్లి పోశం, కన్నం లక్ష్మీనారాయణ, కె.కనకరాజు తదితరులున్నారు. అంతకు ముందు యూనియన్ సమావేశంలో మాట్లాడుతూ సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఎఐటియుసి గెలిపించారని, గత కార్మిక సంఘాలకు భిన్నంగా కార్మికులకు ఎలాంటి డబ్బుల దందాలు లేకుండా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని కోరారు. మనం చిన్న తప్పు చేసిన కార్మికులు సహించరని అన్నారు. సమస్యలపై పోరాడుతూ కార్మికులకు మరింత చేరువ కావాలని కోరారు. ఈ సమావేశంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య, నాయకులు ఎల్.ప్రకాష్, వెంకటస్వామి, వీరభద్రయ్య, వైవి.రావు, మడ్డి ఎల్లయ్య, ముసికె సమ్మయ్య తదితరులు మాట్లాడారు.